రైతులు సంఘాలుగా ఏర్పడాలి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: ప్రభుత్వం అమలుచేస్తోన్న పథకాల రాయితీలు, రుణాలు వర్తించే విధంగా రైతులు సంఘాలుగా ఏర్పడాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ రైతులకు పిలుపు నిచ్చారు. మండలంలోని వెలగవలస గ్రామంలో గురువారం రైతులతో ముఖా ముఖి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ముచ్చటించారు. నిమ్మగడ్డి సాగు, దిగుబడి, ఆదాయం, సాగులోని ఏమైనా సమస్యలు ఉన్నాయా అనే అంశాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. నిమ్మగడ్డి సాగు ఏ విధంగా ఉంది అని రైతులను ప్రశ్నించగా పంట లాభదాయకంగా ఉందని, వేసవిలో గడ్డి ఆయిల్ అధిక దిగుబడి వస్తుందని తెలియజేస్తూ, సాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని కలెక్టరుకు రైతులు వివరించారు. రైతులు సంఘాలుగా ఏర్పడి రైతులు, ప్రభుత్వం చెరిసగం సహకారంతో నీటి బావులు తవ్వించి సోలార్ విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని సూచించారు. సూక్ష్మ నీటి సేద్యం ద్వారా సాగుకి స్ప్రింక్లర్లు ఉచితంగా అందిస్తామని స్పష్టం చేసారు. ఉపాధి హామీ పథకం కింద నిమ్మగడ్డి సాగు చేసుకొనే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని వెల్లడించారు. ఆయిల్ ఉత్పత్తికి అవసరమైన బాయిలర్లను ఏర్పాటుకు రైతుల భాగస్వామ్యం అవసరమని హితవు పలికారు. గ్రామంలో వలసలపై ఆరాతీసిన ఆయన వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు అందుతున్న విషయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూజివీడు సీడ్స్ సంపద రకం వరి విత్తనాలను సరఫరా చేయాలని రైతులు కోరగా, తక్షణమే స్పందించి వ్యవసాయ శాఖ కమీషనర్ తో ఫోన్ లో మాట్లాడారు. అదే రకమైన 1318 విత్తనాలు అందుబాటులో ఉన్నందున సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇటువంటి విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యాన వన సహాయకులను కలెక్టర్ ఆదేశించారు. ఈ ముఖాముఖిలో ఆయన వెంట సర్పంచ్ దాలమ్మ, జిల్లా ఉద్యానవన అధికారి బి.శ్యామల, ఎంపీడీఓ గోర్లి రమేష్ బాబు, మండల ఉద్యానవన అధికారి ప్రియాంక, పంచాయితీ కార్యదర్శి వి.భార్గవ్,ఫీల్డ్ అసిస్టెంట్ పి.నూకరాజు, పంచాయతీ కార్యదర్శి వి.భార్గవ్ పాల్గొన్నారు.

ప్రపంచ ప్రీక్లాంప్సియా గురించి అవగాహన

విశాలాంధ్ర-గరుగుబిల్లి/జియ్యమ్మవలస: ప్రపంచ ప్రీక్లాంప్సియా దినోత్సవం సందర్భంగా గురువారం గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి డాక్టర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రీక్లాంప్సియా గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీక్లాంప్సియా గర్భధారణ సమయంలో వచ్చే ఒక ప్రమాదకరమైన పరిస్థితి అని ఈ వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా, గర్భవతులు ముందస్తుగా గుర్తిస్తే చికిత్స చేయించుకోవడానికి, ప్రమాదాలను తగ్గించడానికి వీలుంటుందని తెలిపారు. ప్రీక్లాంప్సియాను పూర్తిగా నివారించలేకపోయినా, కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాన్ని తగ్గించవచ్చని గర్భవతులు క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించడం, సరైన ఆహారం తీసుకోవడం, ధూమపానం చేయకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రీక్లాంప్సియా నిర్ధారణ అయిన వెంటనే, తక్షణమే చికిత్స చేయించడం చాలా ముఖ్యమని చికిత్స ద్వారా తల్లి, బిడ్డ ఇద్దరి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. 2025లో ప్రపంచ ప్రీక్లాంప్సియా దినోత్సవం యొక్క థీమ్ గురించి ప్రీక్లాంప్సియా ఫౌండేషన్ చెబుతోందని ఈ థీమ్ ద్వారా ప్రజలకు ప్రీక్లాంప్సియా గురించి మరింత సమాచారం అందించడానికి సందేహాలను నివృత్తి చేయడానికి ఉద్దేశించబడిందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ చిన్నమ్మి, రవణమ్మ, ఉదయ్ కుమారి, దుర్గాప్రసాద్ మరియు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతిలో పాల్గొన్న కలెక్టర్

విశాలాంధ్ర -పార్వతీపురం రూరల్: మండలం లచ్చిరాజు పేట గ్రామంలో ఉన్న శ్రీ కాశీ అన్నపూర్ణ, అయ్యప్ప స్వామి సమేత అభయాంజనేయ స్వామి ఆలయంలో గురువారం హనుమజ్జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ రొంపెల్లి శివశ్రీ అధ్వర్యంలో అర్చకులు అజయ్ అభయ ఆంజనేయ స్వామికి విశేష పూజలు,అభిషేకాలు నిర్వహించారు. ఈ హనుమాన్ జయంతి వేడుకలు భాగంగా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు కలెక్టర్ కు స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయం లోని శివ లింగానికి గ్రామానికి చెందిన కర్రి వెంకట రమణ, వంశీ కృష్ణలు రూ 1లక్ష విలువ చేసే వెండి నాగ పడగ అందచేశారు. దాతలు పువ్వాడ శ్రీనివాసరావు-రాధ, వెంకట్-అంబిక, ఫణికుమార్- సింధు, రఘు-బ్యూల దంపతులు 2వేల మంది భక్తులకు కి అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు రొంపెల్లి వెంకట రమణ, బంకపల్లి వెంకటరమణ, కర్రి వెంకట రమణ, తదితర కమిటీ సభ్యులు

ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులుగా ఎమ్మెల్యే జయకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మోజోరు

విశాలాంధ్ర-సీతంపేట: పాలకొండ నియోజకవర్గం శాసనసభ్యులు ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులుగా పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మోజోరు. తేజోవతి నియమితులయ్యారు అని రాష్ట్ర ప్రభుత్వం ట్రైబల్ అడ్వైజరీ కమిటీని గురువారం ప్రకటించింది. గిరిజన శాఖ మంత్రి చైర్మన్‌గా ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎస్సీ, ఎస్టీ డైరెక్టర్ సభ్యులుగా ఉన్న కమిటీలో 16 మందిని సభ్యులుగా నియమించారు. ఈ కమిటీలో పాలకొండ ఎమ్మెల్యేతో పాటు గత ఎన్నికల్లో పాలకొండలో టీడీపీ టికెట్ ఆశించిన తేజోవతికి ఈ కమిటీలో స్థానం కల్పించారు. ఈ కమిటీ నియామకంపై కూటమి నాయకులు, గిరిజన సంఘాల నాయకులు గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు, కార్యకర్తలు ప్రజలు అభినందనలు తెలిపారు.

టెండర్ పిలిచేందుకు నో చెప్పిన చైర్‌పర్సన్

- ఖంగుతిన్న కమిషనర్ - విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఇటీవల మున్సిపాలిటీలో పలుఅభివృద్ధి పనులను చేపట్టేందుకు మున్సిపల్ అధికారులు 67.17 లక్షలతో ఆన్లైన్ లో టెండర్లను పిలిచారు.అయితే ఈ టెండర్లలోని పనులను దక్కించుకునేందుకు పట్టణానికి చెందిన నలుగురు కాంట్రాక్టర్లు టెండర్లను కోడ్ చేశారు. వీరితోపాటు రాజాం ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్ టెండర్ లో తక్కువ ధరకు కోడ్‌చేశారని ఈ పనులను ఎలాగైనా సదరు కాంట్రాక్టర్ కే ఇచ్చేం దుకు కమిషనర్ ఎక్కువ ధరకు కోడ్ చేసిన నలుగురు కాంట్రాక్టర్ల వద్ద బలవంతపు అంగీకార పత్రాలు తీసుకొని ఇంజనీరింగ్ అధికారుల మెడపై కత్తి పెట్టారన్న విషయాన్ని విశాలాంధ్ర దినపత్రికలో ఈనెల 21 తేదీన "అభివృద్ధి పనులకు టెండరింగ్"అనే వార్త ప్రచురితమైంది. ఇది ఇలా ఉండగా ఈ వార్త మింగుడు పడని మున్సిపల్ కమిషనర్ ఈ టెండర్లను రద్దు చేసి మరలా ఈ పనులకు రీ టెండర్ పిలిచేందుకు చైర్ పర్సన్ ముందస్తు అనుమతిని కోరగా ఈ పనులు నిమిత్తం ఇటీవల నిర్వహించిన టెండర్లలో ఎవరు పాల్గొన్నారో ప్రాధాన్యత ప్రకారం వారికి ఆ పనులు అప్పగించేందుకు నేడు జరగనున్న పాలకవర్గ సమావేశంలో సంబంధించిన సబ్జెక్టును పొందుపరచాలని,ఈ టెండర్లను రద్దుచేసి మరలా రీ కాల్ టెండర్ పిలిచేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ముందస్తు అనుమతి ఇచ్చే ప్రసక్తి లేదని సున్నితంగా మున్సిపల్ చైర్ పర్సన్ తిరస్కరించారన్న విషయం తెలియ వచ్చింది.ఈ విషయం సదరు టెండర్లలో పాల్గొని పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లలో ఆనందాన్ని నెలకొల్పింది.

గర్భిణీలకు అవగాహన అవసరం

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: గర్భం దాల్చిన ప్రతి స్త్రీ ఆ సమయంలో వచ్చే పలు వ్యాధులు పట్ల తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే వాటిని ప్రాథమిక దశలోనే నియంత్రించవచ్చు అని, సంపూర్ణ ఆరోగ్యంతో బిడ్డను జన్మ ఇవ్వగలమని బంధ లుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు తిరుమల ప్రసాద్ అన్నారు. ప్రపంచ ప్రీక్లాంప్సియా దినోత్సవం సందర్భంగా పి హెచ్ సి ఆధ్వర్యం లో ప్రపంచ ప్రీక్లాంప్సియా గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రీక్లాంప్సియా గర్భధారణ సమయంలో వచ్చే ఒక ప్రమాదకరమైన పరిస్థితి. ఈ వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా, గర్భవతులు ముందస్తుగా గుర్తిస్తే చికిత్స చేయించుకోవడానికి ప్రమాదాలను తగ్గించడానికి వీలుంటుంది. ప్రీక్లాంప్సి యాను పూర్తిగా నివారించలేక పోయినా, కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాన్ని తగ్గించవచ్చు. గర్భవతులు క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించడం, సరైన ఆహారం తీసుకోవడం, ధూమపానం చేయకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి.ప్రీక్లాంప్సియా నిర్ధారణ అయిన వెంటనే, తక్షణమే చికిత్స చేయించడం చాలా ముఖ్యం. చికిత్స ద్వారా తల్లి మరియు బిడ్డ ఇద్దరి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జయగౌడ్, నాగమ్మ ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సీతంపేటలో విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర-సీతంపేట: మండలంలో 23వ తేదీన 33/11కేవీ సబ్ స్టేషన్ లో మైంటెనెన్స్ వర్క్ పనులు జరుగును కనుక సీతంపేట మండలం లో విద్యుత్ అంతరాయం గురువారం ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 12:00ల వరకు విద్యుత్ నిలుపుదల చేయబడునని ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విష్ణుమూర్తి మరియు డిప్యూటీ ఈఈ చక్రవర్తి సీతంపేట మండల ఎలక్ట్రికల్ ఏఈ జి. నీలిమ పత్రికా ప్రకటన ద్వారా ప్రజలు సహకరించవలసినదిగా తెలిపారు.

పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: జిల్లాలో వివిధ దశల్లో ఉన్న పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మండలంలోని చెప్పవానివలస గ్రామంలో పర్యటించి వివిధ దశలో ఉన్న పీఎం జన్ మన్ గృహ నిర్మాణాలను ఆయన గురువారం పరిశీలించారు. గృహ నిర్మాణాలు జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్ పనులను మరింత వేగవంతంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారి యంత్రాంగానికి సూచించారు.గృహ నిర్మాణానికి సంబంధించిన రెండవ విడత బిల్లులు మరికొద్ది రోజుల్లో మంజూరు కానుందని, కావున వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గృహ నిర్మాణాల సామగ్రి అందుబాటులో ఉన్నది లేనిది ఆరా తీసిన ఆయన పనులకు ఆటంకం లేకుండా అవసరమైన సామాగ్రిని ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని హితవు పలికారు. ఈ పర్యటన కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారి జి.సోమేశ్వరరావు, చిరంజీవి, ఎంపీడీవో రమేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి.ఎస్.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మెచ్చిన బడి నుండి పొలంబడికి కార్యక్రమం

విశాలాంధ్ర-పార్వతీపురం: విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ పర్యావరణశాఖ నిర్వహించిన బయోడైవర్సిటీ సదస్సులో జట్టు ట్రస్ట్ ఏర్పాటు చేసిన బడినుండి పొలంబడికి కాన్సెప్ట్ మీద ఏర్పాటు చేసిన స్టాల్ సందర్శించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభినందించారు.పార్వతీపురం మన్యం జిల్లాలో అమలు జరుగుతున్న ఈ కాన్సెప్ట్ తనకునచ్చిందని,దీనిమీద మరింత చర్చించడానికి తన కార్యాలయానికి రావలసినదిగా ఆహ్వానించారు. మనబడి మనతోటపేరుతో జిల్లా కలెక్టర్ సహకారంతో జట్టు ట్రస్ట్ 200 పాఠశాలల్లో శిక్షణా కార్యక్రమం నిర్వహించడం, ప్రకృతి వ్యవసాయం మీద ప్రత్యేక పుస్తకాలను ప్రచురించి, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఈకార్యక్రమంలో విద్యార్థులు ఆడుతూ , పాడుతూ బడితోటలో కూరగాయలు, పండ్లు , పూలు పండిస్తూ వ్యవసాయం పట్ల అవగాహన చేసుకుంటున్నారని తెలుసుకొని డిప్యూటీ సీఎం ఆనందం వ్యక్తంచేశారన్నారు. ఈ కార్యక్రమంలో జట్టు ట్రస్ట్ డిప్యూటీ సీఈఓ ఎం నూకం నాయుడు, జట్టు ట్రస్ట్ డెవలప్మెంట్ మేనేజర్ డి. నవజీవన్ పాల్గొని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు అన్ని అంశాలను వివరించారు.

గర్భిణీలకు అధిక రక్తపోటు నివారణకై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-బలిజిపేట: స్థానిక పీహెచ్‌సీలో గురువారం గర్భిణీలకు అధిక రక్తపోటు నివారణ కోసం అవగాహన ర్యాలీ జరిగింది ఈ ర్యాలీ పిహెచ్‌సి వైద్యాధికారిని డాక్టర్ క్రాంతి కిరణ్మయి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఆశాలు ర్యాలీ చేశారు. ప్రపంచ ప్రీ ఎక్లాంప్సియాడే(మే22) వ తేదీన సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారిని డాక్టర్ క్రాంతి కిరణ్మయి మాట్లాడుతూ గర్భవతులకు గర్భిణీ సమయానికి ముందు గర్భిణీ సమయంలోనూ అధిక రక్తపోటు ఉంటే తక్షణమే నిపుణుల సలహాలు పొందడం అవసరం అని తద్వారా తల్లిబిడ్డల ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చునిఅన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ సత్యనారాయణ, సూపర్వైజర్ జి నాని, హెల్త్ అసిస్టెంట్ పి ఉమామహేశ్వరరావు తదితర్లు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు అధిక ప్రాధాన్యత

డిప్యూటీ డైరెక్టర్ రామానందం

విశాలాంధ్ర-చింతపల్లి : మలేరియా నివారణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని జాతీయ వాహక సంబంధ వ్యాధుల నియంత్రణ కార్యక్రమం(ఎన్వీబీడీసీపీ) రామనందం అన్నారు. బుధవారం చింతపల్లి మండలంలో పర్యటించిన ఆయన స్థానిక ఏరియా ఆస్పత్రి, లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. చెరుకుంపాకలు గ్రామంలో జరుగుతున్న దోమల మందు పిచికారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వల్ల కలిగే వ్యాధులను నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. గిరిజన ప్రాంతంలో ప్రధానంగా మలేరియా నిర్మూలనకు చర్యలు చేపట్టిందన్నారు. మలేరియాతో ఒక్కరు కూడా మరణించరాదన్నారు. గిరిజన ప్రాంతంలో మలేరియా కేసులను సకాలంలో గుర్తించడం జరుగుతుందన్నారు. వ్యాధి సోకిన వెంటనే వ్యాధిగ్రస్తులకు చికిత్స అందిస్తున్నామన్నారు. గ్రామ స్థాయిలోనే మలేరియాను గుర్తించేందుకు ఆశ కార్యకర్తల వద్ద వ్యాధి నిర్ధారణ కిట్లు అందుబాటులో ఉంచామన్నారు. గత ఏడాది మలేరియా కేసులు నమోదైన గ్రామాల్లో దోమల మందు పిచికారి జరుగుతుందన్నారు. రెండో విడతలో ప్రతి గ్రామంలోనూ దోమల మందు పిచికారి చేస్తామన్నారు. ప్రజలు దోమ తెరలు వినియోగించడం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంపై వైద్య ఆరోగ్యశాఖ, మలేరియా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రధానంగా గృహాలు, వీధుల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రాదమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రిల్లో మలేరియా రోగులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జ్వరబాధితులకు సకాలంలో రక్త పరీక్ష చేయడం, వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే చికిత్స ప్రారంబించాలన్నారు. మలేరియా నిర్మూలనకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, క్షేత్ర స్థాయి వైద్యసిబ్బంది సమన్వయం తో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి(జీఎంవో) తులసి, ఏఎంవో సత్యనారయాణ, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

25న మండల మహాసభ

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సింహాచలం

విశాలాంధ్ర-దుంబ్రిగుడ: ఈనెల 25న మండల కేంద్రంలోని మహాసభ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిపిఐ అల్లూరి జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. సింహాచలం అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 25న జరిగే సిపిఐ మహాసభ కార్యక్రమం కు మండల నాయకులు ప్రతి ఒక్కరు విధిగా హాజరుకావాలని ఆయన సూచించారు.

60 కుటుంబాలు జనసేన పార్టీ లో చేరిక

విశాలాంధ్ర -జికెవీధి : మండలంలోని జర్రిల పంచాయితి చింతలవాడ, కొండపల్లి, డబ్బా గొంది, రాళ్లగడ్డ, రాసకోట, జే కొత్తూరు, వంతాడపల్లి, అరగడపల్లి గ్రామాలలోని గ్రామస్థుల పిలుపు మేరకు జనసేన మండల ప్రధాన కార్యదర్శి పొత్తూరు విష్ణుమూర్తి, చిక్కుడు అశోక్ ఆధ్వర్యంలో గూడెం కొత్తవీధి జనసేనా మండల అధ్యక్షులు కొయ్యాం బాలరాజు, అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లెల వీరవెంకట్ మరియు మండల నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అరకు పార్లమెంట్ ఇన్చార్జి డా.వంపూరి గంగులయ్య ముఖ్య అతిథిగా హాజరైన మారుమూల 10 గ్రామాలలోని ప్రజలు సుమారు 60 కుటుంబాలకు పైగా జన సైనికులకు జనసేన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.జర్రిల వైస్ సర్పంచ్ పోత్తూరు వెంకటేష్ వార్డ్ మెంబర్లు కొంతలంగి భగవాన్,వెంకట్రావు తదితరులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ కొయ్యం చిద్దు,మండల ఉపఅధ్యక్షుడు సిద్దార్థ్ మార్క్‌వనవల ఈశ్వరరావు,గడుతూరి పరమేశ్వర రావు,గడుతురి రమణ,ఊళం ఈశ్వర్, పాంగి కృష్ణారావు, వసవరి ప్రసాద్, మారుమూల 10 గ్రామల ప్రజలు పాల్గొన్నారు.

ఆంధ్రా -చత్తీస్ ఘడ్ ఎన్‌కౌంటర్ తో అప్రమత్తమైన పోలీసులు

రాత్రి బస్సు సర్వీసులను రద్దు చేసిన ఆర్టీసీ అధికారులు

విశాలాంధ్ర-సీలేరు : ఆంధ్రా-చత్తీస్‌ఘడ్ సరిహద్దుల్లో జరిగిన ఎన్కౌంటర్ కు నిరసనగా ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో మావోయిస్టులు తెగబడే ప్రమాదం ఉందని నిఘవర్గాల హెచ్చరికలతో స్థానిక పోలీసులు అప్రమత్తం అయ్యారు. సీలేరులో ఎస్సై రవీంద్ర ఆధ్వర్యంలో పలుకూడల్ల వద్ద గస్తీ నిర్వహిస్తున్నారు. వాహనాల తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి విడిచిపెడుతున్నారు. అపరిచితులు ఎవరైనా గ్రామంలో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వరుస ఎన్కౌంటర్లతో భారీగా నష్టపోయిన మావోయిస్టులు సరిహద్దుల్లో చొరబాటుకు యత్నించే అవకాశం ఉందని సరిహద్దు అటవీ ప్రాంతాన్ని పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఈ సందర్భంగా వారం రోజులపాటు రాత్రి బస్సు సర్వీసులను రద్దు చేస్తున్నట్టు ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. మళ్లీ వారం రోజుల తర్వాత రాత్రిపూట బస్సు సర్వీసులు నడుపుతామని తెలిపారు. విశాఖపట్నం నుండి భద్రాచలం, భద్రాచలం నుండి విశాఖపట్నం, పాడేరు నుండి భద్రాచలం, భద్రాచలం నుండి పాడేరు, సీలేరు నుండి విశాఖపట్నం, విశాఖపట్నం నుండి సీలేరు తిరిగే రాత్రి బస్ సర్వీసుల్ని నేటి నుండి అధికారులు నిలిపి వేయనున్నారు.

గిరిజన మహిళలు వ్యాపార వేత్తలుగా ఎదగాలి

ఐటిడిఏ ఇంచార్జి పిఓ జెసి డా. అభిషేక్ గౌడ

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు: గిరిజన మహిళలు వన్‌ధన్ వికాస కేంద్రాలను సద్వినియోగం చేసుకుని వ్యాపార వేత్తలుగా ఎదగాలని ఐటిడిఏ ఇంచార్జి పి. ఓ. జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ పేర్కొన్నారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో 11 మండలాలల 106 విడివికె సభ్యులకు గురువారం నిర్వహించిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలకు విడివికె ఉత్పత్తుల ప్యాకింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్, ఇ-కామర్స్ రంగాలలో శిక్షణ అందిస్తా మన్నారు. ఉత్పత్తి కేంద్రాలకు అదనపు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఇ-కామర్స్లో గిరిజన ఉత్పత్తులను విక్రయించాలని చెప్పారు. ఆర్గానిక్ ఉత్పత్తులకు మార్కెట్లో మంచి గిరాకి ఉందన్నారు. గిరిజన ఉత్పత్తులకు అదనపు విలువలను జోడిస్తే మంచి డిమాండ్ ఉంటుందని ప్రజల్లో నమ్మకం పెరుగుతుందన్నారు. ఆర్గానిక్ సర్టిఫికేష్ తీసుకుని వస్తే మార్కెట్ విస్తరణ పెరుగుతుందన్నారు. విడివికె ఉత్పత్తులను ట్రైఫెడు అనుసంధానం చేస్తా మన్నారు. అదే విధంగా గిరిజన ఉత్పత్తులను దేశ వ్యాప్తంగా విస్తరించాలని అన్నారు. విడివికె ఉత్పత్తులు, వాటి సమస్యలపై ఎవి ఎంలు నివేధికలు సమర్పిస్తే పరిష్కార చర్యలు చేపడతామని చెప్పారు. అడ్డాకులతో తయారు చేసిన ప్లేట్లు, కప్పుల తయారీ పై సభ్యులను అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు సభలు, సమావేశాలకు చిరుధాన్యాలతో తయారుచేసిన బిస్కెట్లును సరఫరా చేయాలని సూచించారు.

నడి సంతలో పొడుపడ్డ నుయ్యి

పొంచి ఉన్న ప్రమాదం-ఆదమరిస్తే అంతే మరి

విశాలాంధ్ర-పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు కేంద్రానికి కూతవేటి దూరంలో ఉన్న గుత్తులపుట్టు వారపు సంతలో పాడుబడ్డ నుయ్యి ఒకటి దర్శన మిస్తుంది. అక్కడ పశువులు వ్యాపారం జోరుగా జరుగుతుంది ఆ మధ్యలో నుయ్యి చుట్టూ నా తుప్పలు బలిసి చుట్టు ప్రహరీ విరిగి ప్రమాద భరితంగా తయారైంది. దీన్ని చూసిన ప్రతి ఒక్కరు బయ ఆందోళనలతో బెంబేలెత్తిపోతున్నారు. తాగిన మైకంలో అటుగా ఎవరైనా వెళ్లిన పశువులు వెళ్లిన కాలుజారి ఆ నూయ్యిలో పడితే అంతే సంగతులు పంచాయతీ అధికారులు మాత్రం వ్యాపారస్తులనుండి ఆశీలు వసూలు మాత్రం జోరుగా నిర్వహిస్తున్నారు తప్ప సంతలో ప్రమాద భరితంగా మారి ఉన్న దాన్ని మాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు సంతలో ప్రమాద భారీతంగా మారిన నూయ్యితో పాటు వివిధ ప్రాంతాల్లో ప్రమాదాభారితంగా మారిన శుభ్రం చేసి ప్రజలకు ఎటువంటి ప్రాణహాని జరగకుండా కాపాడాలని పలువురు కోరుతున్నారు ఆ దిశగా పంచాయతీ అధికారులు అడుగులు వేస్తారో లేదో వేచి చూద్దాం మరి.

జీసీసీ బీఎంగా పాంగి కుమారస్వామి

విశాలాంధ్ర-ముంచంగిపుట్టు : ముంచింగిపుట్టు మండల కేంద్రంలో గల గిరిజన సహకార సంస్థ బ్రాంచి మేనేజర్ గా పాంగి కుమారస్వామి నియమితులయ్యారు. గత కొన్నేళ్ళుగా ఎంఎల్ఎస్ గోదాము ఇంచార్జిగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు జిసిసి మేనేజర్ బ్రాంచిగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన గురువారం జిసిసి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు జిసిసి సిబ్బందితో పాటు పలువురు నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేనేజర్ కుమార్ స్వామి మాట్లాడుతూ అందరి సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు జిసిసి సంస్థ పురోభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిసిసి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభ దశలో నిలిచిపోయిన సచివాలయం

ఇబ్బందులు పడుతున్న సచివాలయ సిబ్బంది



విశాలాంధ్ర-దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని పోతంగి పంచాయితీ సచివాలయం కొన్ని లక్షల వ్యాయామంతో నిర్మించిన సచివాలయ భవనం ప్రారంభ దశలోని నిలిచిపోవడంతో పంచాయితీ అధికారులు పలు ఇబ్బందులు పడవలసిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వ హయాంలో 2019 లో ప్రారంభించిన సచివాలయ భవనం సుమారు 6 సంవత్సరాలు గడిచిన నేటికి ప్రారంభం కాకపోవడంతో పంచాయితీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని మండల కేంద్ర వాసులతోపాటు పలు ప్రజా సంఘ నాయకులు వాపోతున్నారు. అన్ని పంచాయతీలకు ఆదర్శంగా ఉండవలసిన మండల కేంద్ర పోతంగి పంచాయతీలోనే సచివాలయ భవనం పూర్తి కాకపోవటంతో పంచాయతీ సిబ్బంది ఎక్కడ ఉండాలో అర్థం కాక ఇబ్బందులు పడుతున్నారని పలువురు అంటున్నారు. పేరుకే మండల కేంద్రమని పూర్తిస్థాయిలో సరైన భవనాలు లేక మండలానికి విలువలేకపోతుందని మండల వాసులతోపాటు పలు ప్రజా సంఘ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయం భవనం నిర్మించి ఆరు సంవత్సరాలు గడిచి వస్తున్నప్పటికీ కూడా ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోకపోవడం సరికాదని మండల కేంద్ర వాసులతో పాటు పలు ప్రజాసంఘా నాయకులు వాపోతున్నారు.అల్లూరి జిల్లాకు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న అరుకు పాడేరు కు ప్రధాన సెంటర్ అయినా దుంబ్రిగుడ మండల కేంద్రంలోని సచివాలయం నిర్మాణ పరిస్థితి ఇలా ఉండడం సిగ్గుచేటని, నిత్యం జిల్లా అధికారులు వస్తూపోతూ ఉంటారే తప్ప ఇటువంటి విషయాలపై తెలుసుకోకపోవడం గమనహారమని మండల కేంద్ర వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండల కేంద్రంలో ప్రారంభ దశలోనే నిలిచిపోయిన సచివాలయ భవనం తక్షణమే ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని మండల కేంద్ర వాసులతో పాటు పలు ప్రజా సంఘ నాయకులు కోరుతున్నారు.

మండల కేంద్రంలోని డ్రైనేజీలు శానిటైజేషన్ చేపించిన అధికారులు

విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర-జీకే వీధి: గూడెం కొత్త వీధి మండల కేంద్రంలో రోడ్డుకి ఇరువైపులా డ్రైనేజీలో చెత్త చెదారం పేరుకుపోయి తీవ్ర దుర్గంధపు వాసన వల్ల వాహనదారులు,షాప్ యజమానులు,పాదచార్లు తీవ్ర ఇబ్బందిగా పడుతున్న తెలిసిందే. దీనిపై విశాలాంధ్ర ఒక కథనాన్ని ప్రచురించింది. స్పందించిన అధికారులు పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే చర్యలు తీసుకున్నారు. మండల కేంద్రంలోని అధికారులు చర్యలు చేపటి డ్రైనేజీలో ఇరు వైపుల పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించె శానిటైజేషన్ కార్యక్రమం చేపట్టడం ద్వారా దుర్గంధపు వాసనా నుండి ఉపశమనం లభిస్తుందని వాహనసోదకులు,షాప్ యజమానులు,పాదచారులు ఆనంద వ్యక్తం చేశారు.

స్థాపితం: 1952
విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
విశాలాంధ్ర దినపత్రికకు
అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ కింది తెలపబడిన మండలాలకు విలేకరులు కావలెను. విశాలాంధ్రలో జర్నలిస్టుగా పనిచేయాలన్న ఆసక్తి గల వారికి అవకాశం కల్పించబడును.
కావాల్సిన ప్రాంతం :
మారేడుమిల్లి
సంప్రదించవలసిన నెం :
డి.యర్రయ్యరెడ్డి, జిల్లా బ్యూరో చీఫ్
7989138129

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు సిపిఎం ర్యాలీ

విశాలాంధ్ర-చింతూరు: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ బుధవారం సిపిఎం పార్టీ నిర్వహించిన బైక్ ర్యాలీలో రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఎర్రం పేట నుండి చింతూరు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు అనంతరం అమరవీరుల స్థూపాల వద్ద ప్రధాన కూడలి లో ఏర్పాటుచేసిన సభలో కార్యదర్శి మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసేదాంట్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాల కుట్రలు పన్నుతున్నారని ఎనిమిది నెలలు కావస్తున్నా కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని. అయినా గాని ఉక్కు కర్మాగారం లాభాల బాటలో నడిచే విధంగా కర్మకార కార్మికులు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. కర్మాగారం కార్మికుల శ్రేయస్సు కోరకుండా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎటువంటి నిధులు కేటాయించకుండా కర్మాగారాన్ని ప్రైవేటు కరణ చేసేందుకు ప్రయత్నించడం పూర్తిగా ప్రజాస్వామ్య విరుద్ధమని కార్మికుల హక్కులను కాలరాసే విధానాన్ని అడ్డుకోవాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఐక్య పోరాటాలు రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఉక్కు కర్మాగార ప్రైవేటీకరణ నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్న అనేక రకాల కార్మిక సంఘాలు ఏకమై అడ్డుకోవాలని అందులో భాగంగానే ఈరోజు బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు లోకనాథం. కిలో సురేందర్. జిల్లా కార్యదర్శి బొప్పన కరణ్. మట్ల వాణిశ్రీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లోత రామారావు. పల్లపు వెంకట్. జిల్లా కమిటీ సభ్యులు సిసం సురేష్. పులి సంతోష్. మేకల నాగేశ్వరరావు. ఐ వెంకటేశ్వర్లు. ఎంపీపీ కారం లక్ష్మి. పోడియం లక్ష్మణ్. ఎర్రంశెట్టి శ్రీనివాసరావు. కారం సుబ్బారావు. మెడకం చిన్నయ్య.ముర్రం రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోరాట ఫలితమే గిరిజన సలహా మండలి ఏర్పాటు

గిరిజన సంక్షేమ సంఘం

ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్

విశాలాంధ్ర-బెలగాం: గిరిజన సంఘాల పోరాట ఫలితమే గిరిజన సలహా మండలి (టిఎసి) ఏర్పాటని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసారు. మండలిలో నియమితులైన సభ్యులు గిరిజన ప్రజల ప్రయోజనాలు, గిరిజన చట్టాలు, జీఓలు పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. తక్షణమే జీఓ 3 తరహా జీఓ తెచ్చి గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయ పోస్టులు గిరిజనులకు ఇవ్వాలని తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి, గవర్నర్ కు ఇవ్వాలని డిమాండ్ చేసారు. 1/70, పీసా లాంటి చట్టాల రక్షణకు, షెడ్యూల్డ్ గ్రామాల గుర్తింపుకు గిరిజన సలహా మండలి పని చేయాలని కోరారు. నియమితులైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

సోమవారం సీతంపేటలో గ్రీవెన్స్

జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ వెల్లడి

విశాలాంధ్ర-సీతంపేట : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) ను సోమవారం మే 26 వ తేది న సీతంపేటలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. సోమవారం ఉదయం 10.00 గం.ల నుండి సీతంపేట ఐటీడిఎ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు. ప్రజలు తమ సమస్యలను సీతంపేటలో సమర్పించవచ్చని ఆయన పేర్కొన్నారు. జిల్లా అధికారులందరూ సీతంపేటలో జరిగే పిజిఆర్ఎస్ కు హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

ఘనంగా శ్రీ ఆంజనేయ స్వామి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-వి.ఆర్.పురం: మండలంలోని చింతరేవుపల్లి గ్రామం లో కొలువైయున్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ ఆంజనేయ స్వామి జయంతి వేడుకలను సమరసత సేవా ఫౌండేషన్, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో గ్రామ ప్రజలు స్వామి వారికి పూజలు నిర్వహించి తమ తమమ్రొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు భక్తులందరికీ అందచేశారు. మండలంలోని వడ్డిగూడెం గ్రామంలో వెలసియున్న శ్రీ సతి పార్వతీ రుద్ర కోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి, రేఖపల్లి, ఉమ్మడివరం, తదితర గ్రామాలలో కొలువైయున్న శ్రీ ఆంజనేయ స్వామికి భక్తజనులు పూజలు నిర్వహించారు.

ఎం.డీ.యు వ్యవస్థ యధావిధిగా కొనసాగించాలిలి



విశాలాంధ్ర-జీకే విధి : గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటి ఇంటికి రేషన్ పథకం తొలగిస్తున్నామని పౌరస రఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించడం బాధాకరమని గూడెం కొత్తవీధి మండల ఎం.డి.యు ఆపరేటర్ల యూనియన్ మండల అధ్యక్షుడు రీమల పాల్,కంకిపాటి నారాయణ అన్నారు.2021 నుండి 2027 జనవరి వరకు ఒప్పందం ఉన్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం 20వ తేదీన జరిగిన కేబినెట్ సమావేశంలో ఇంటికి ఇంటికి రేషన్ వ్యవస్థను ఎటువంటి అదేశాలు జారీ చెయ్యకుండా రేషన్ వాహనాలు రద్దు చేస్తున్నట్టు ప్రకటించాట్టడం చాలా బాధాకరం తెలియజేశారు. పంచాయతీకి ఒక ఎం.డి.యు ఆపరేటర్ పని చేస్తున్నప్పటికి ఆ ఆపేరేటర్ కి వేరే ఉపాధి చూపకుండా తొలగించడం ప్రభుత్వం యొక్క వైపాళ్యం స్పష్టంగా కనబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి అంగన్వాడి కేంద్రనికి పాఠశాలలకు నగదు తీసుకోకుండా ప్రతి నెల ఉచ్చితంగా సరకులు అందజేస్తు విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటికి ఇంటికి రేషన్ వాహనాలు రద్దు సరికాదిని ప్రభుత్వం పునరా ఆలోచన చేసి ఇంటికి ఇంటికి రేషన్ వాహన పథకన్ని కొనసాగించాలని కోరుతున్నామని గూడెం కొత్త వీధి మండల రేషన్ వాహనాదారుల సంఘం అధ్యక్షుడు రీమల పాల్, కంకిపాటి నారాయణ,ఎం డి యు ఆపరేటర్లు కోరారు.

కలెక్టర్ ను కలిసిన జీసీసీ అధికారి రామారావు

విశాలాంధ-పార్వతీపురం : జిల్లాసహకార సంస్థ (జి సి సి)జిల్లా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జె. రామారావు గురువారం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమును అందజేశారు. గిరిజన సహకార సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు బదిలీ జరిగిన జిసిసి డివిజనల్ మేనేజర్ మహేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా యోగ డే

విశాలాంధ్ర-చింతూరు: యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ జూన్ 21 తేదీను ఇంటర్నేషనల్ యోగా డే డిసెంబర్ 2014లో డిక్లేర్ చేయటం జరిగినది. మొదటి ఇంటర్నేషనల్ యోగా డే ను జూన్ 21,2015 తేదీన 170 దేశాలు కు పైన నిర్వహించడం జరిగినది. దీనిలో భాగంగా ది. 21.05.2025 నాడు ప్రాజెక్టు అధికారి ఐటిడిఎ అధ్వర్యంలో ఐటిడిఎ నుండి ఆశ్రమ బాలికల స్కూల్, చింతూరు వరకు వివిధ శాఖల ఉద్యోగులతో ర్యాలీ గా వచ్చి యోగా కార్యక్రమం నిర్వహించడం జరిగినది. యోగా ఆంధ్రా 2025 భాగంలో మే 21 నుండి యోగా కార్యక్రమం ప్రారంభించడం జరిగింది అని పి ఓ పేర్కొన్నారు. మొదట పి ఓ మాట్లాడుతూ యోగా వలన ఆరోగ్యం గా ఉండొచ్చు అని దాని వలన కలిగే ప్రయోజనాలు, ప్రతి ఒకరు వారి ఆరోగ్యం కోసం ఒక ముప్పై నిమిషాలు యోగాకు కేటాయించాలని అని అన్నారు. తదుపరి స్వయంగా యోగా కు సంబంధించిన ఆసనాలు అందరితో వేయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి, ఏటిడబ్ల్యూఓ, తహశీల్దార్, ఎంపీడీవో ఇతర అధికారులు పాల్గొన్నారు.

భక్తాంజనేయ స్వామివారికి అర్చనలు

విశాలాంధ్ర-బెలగాం: స్థానిక శ్రీ సూర్యపీఠంలో క్షేత్రపాలకునిగా వేంచేసియున్న భక్తాంజనేయ స్వామి వారికి తమాలార్చన, సింధూరార్చన, నవనీతార్చన జరిగాయి. హనుమత్ షడంగ పారాయణ, రుద్రమన్యుసూక్త పారాయణలు జరిగాయి. విశ్వశాంతి మంత్ర సవనం చేసారు. యజ్ఞశాలలో ఆంజనేయ స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమం అశేషశేముషీనిధి బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి ఆశీస్సులతో వేమకోటి వివేకానంద, వేమకోటి విశ్వ వరేణ్య శర్మ, వేమకోటి గౌతమ విరాట్ శాస్త్రి, పులఖండం జ్ఞానేష్ శర్మ నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

విశాలాంధ్ర-మోతుగూడెం: మోతుగూడెం, పొల్లూరు, గ్రామలలోని ఆంజనేయ స్వామి వారి ఆలయాలలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి మంత్ర పుష్పాలతో నీరజనం సమర్పించారు.

టిఎసి ఏర్పాటుపై ఆదివాసి జేఏసీ హర్షం

విశాలాంధ్ర-బెలగాం: రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు అయ్యి ఏడాది గడిచినా ట్రైబల్ అడ్వైజర్ కౌన్సిల్ టిఎసి ఏర్పాటు చేయకపోవడంతో దీనిపై ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ అనేకసార్లు టిఎసి ఏర్పాటు చేయాలని ధర్నాలు నిరసన కార్యక్రమం చేయడంతో నేటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి టిఎసి ఏర్పాటు చేయడం జరిగిందని జెఎసి తరపున హర్షం వ్యక్తం చేస్తున్నామని ఆదివాసి జెఎసి యాక్షన్ కమిటీ నాయకులు టి. జయన్న, దుక్క సీతారాం, ఆరిక చంద్రశేఖర్, ఐ. రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు వారు టిఎసి ఏర్పాటుకు కృషిచేసిన గిరిజన సంక్షేమ మంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నామని తెలిపారు.

కార్మిక నేత, కమ్యూనిస్టు ఉద్యమ చైతన్య పతాక పర్సా వర్ధంతి

విశాలాంధ్ర-బలిజిపేట : కార్మిక నేత కమ్యూనిస్టు ఉద్యమ చైతన్య పతాక పర్సా వర్ధంతి సందర్భంగా బలిజిపేట మండలం ప్రజాసంఘాల కార్యాలయంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడుతూ పర్స సత్యనారాయణ భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రముఖ నాయకుడిగా ప్రసిద్ధిగాంచారని 19 సంవత్సరాలు వయసులోనే కమ్యూనిస్టు ఉద్యమంలో చేరి నైజం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి సాయుధ పోరాటానికి సిద్ధం చేశారు పాలవంచ ఏరియా దళ కమాండ్రీగా పనిచేసి నిజం ఆకృత్యాలపై పోరు నడిపారు సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమర శంఖం పూరించి వారికి బాసటగా నిలిచారు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ స్థాపించారు కార్మికుల జీవితాలు మార్పు కోసం అనేక పోరాటాలు నిర్వహించి కార్మికు శ్రేయస్ కోసం పాటుపడిన నాయకులు పరస సత్యనారాయణ గారు సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షునిగా పనిచేసి కార్మిక చట్టాలు కార్మికులకు ఉపయోగపడే విధంగా ఉద్యమాలు నడిపారు నిరంతరం కార్మికుల పక్షాన ప్రజల పక్షాన గళం విప్పి వారు ఆయన మన మధ్య లేకపోయినా ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే ఆయనకు నిజమైన నివ్వాలని అన్నారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నల్ల ఈశ్వరరావు ఆటో యూనియన్ నాయకులు సీతారాం భాస్కరరావు జ్యోతి భాగ్యం సుధా లక్ష్మము తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ప్రీక్లాంప్సియా దినోత్సవం సందర్భంగా అవగాహన

డిఎం&హెచ్ఓ డాక్టర్ భాస్కరరావు



విశాలాంధ్ర-బెలగాం: గర్భిణీల్లో ప్రీఎక్లంప్సియా ఒక ప్రమాదకర సూచికని, సకాలంలో లక్షణాలు గుర్తించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు సూచించారు. ప్రపంచ ప్రీ - ఎక్లంప్సియా దినోత్సవం సందర్భంగా సందర్భంగా గురువారం ఆరోగ్య కార్యాలయం ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ గర్భవతుల సమయంలో హైరిస్క్ సమస్యలు ముందస్తుగా గుర్తించాలని ఇందులో ప్రీ ఎక్లంప్సియా ఒక ప్రమాదకర సూచికని లక్షణాలతో ముందస్తుగానే గుర్తించి తగు చికిత్స, పర్యవేక్షణ తప్పనిసరి అని సూచించారు. బిపి అధికంగా ఉండటం (140/90 పైన), తీవ్రమైన తలనొప్పి, దృష్టి సమస్య, ముఖం చేతులు కాళ్ళు ఉబ్బడం, మూత్ర విసర్జన తగ్గడం, ఎపిగ్యాస్ట్రిక్ నొప్పి లక్షణాల ద్వారా గుర్తించాలన్నారు. అదే విధంగా గతంలో గాని, కుటుంబ సభ్యుల్లో గానీ ఇటువంటి ఉన్నాయా అని తెలుసుకోవాలని మొదటి కాన్పు, కవలలు, బహుళ కాన్పులు, ఒబెసిటీ ఉన్నవారిలో ఎక్కువగా ఈ సమస్య ఉండే అవకాశం ఉందన్నారు. బిపి ఖచ్చితంగా నమోదు చేస్తూ ఎప్పటికపుడు పర్యవేక్షణ చేయాలని, యూరిన్ అల్బుమిన్ పరీక్షా నివేదికలు పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్మోహనరావు, డా. పిఎల్ రఘుకుమార్, డిపిహెచ్ఎన్ఓ ఉషారాణి, డిపిఓ లీలారాణి, కార్యాలయ సూపరింటెండెంట్ కామేశ్వరరావు, డిసిఎం విజయలత, సిసి శ్రీనివాసరావు, వైద్య మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరంలో అయోధ్యరాముని ధనస్సుకు పూజలు

విశాలాంధ్ర -సీతానగరం: మండలకేంద్రంలో శ్రీవేణుగోపాలస్వామి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయ ప్రాంగణంలో గురువారంనాడు అయోధ్య నుండి విచ్చేసిన అయోధ్యరాముని ధనుర్బాణంకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెండి బంగారంతో తయారుచేసిన శ్రీరాముడి ధనస్సు దేశవ్యాప్తంగా భక్తుల కోసం తీసుకు వెళ్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా గురువారం సీతానగరం తీసుకొని రాగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు ధనస్సును సందర్శించి పూజలు నిర్వహించారు. గురువారం నాడు హనుమాన్ జయంతి కార్యక్రమం సందర్భంగా సీతానగరం రామ ధనస్సు రావడం, పూజించడం ఎంతో ఆనందంగా ఉందని భక్తులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు, టీటీడీ పారాయణకర్త శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్త దంపతులు చెలికాని వెంకట గోపాలకృష్ణ భారతి లతోపాటు భక్తులు పెద్దఎత్తున పాల్గొని పూజలు చేశారు.

అసంపూర్తి పశువుల వసతిగృహాల నిర్మాణాలు పూర్తికి కదలిక

కలెక్టర్ చొరవతో నల్లగొండలో అసంపూర్తి

షెడ్లనిర్మాణాలకు చర్యలు

పిఆర్ఈఈటీ కొండయ్య పడాల్ వెల్లడి

విశాలాంధ్ర-కొయ్యూరు : మండలంలోని నల్లగొండ లో ఎట్టకేలకు "అసంపూర్తిగా వదిలేసిన' పశువుల పెంపక వసతి గృహ భవనల నిర్మాణాలు పూర్తికి తిరిగి మోక్షం కలగనుంది. కలెక్టర్ ప్రత్యేక చొరవతో నల్లగొండ వద్ద అసంపూర్తిగా .దశాబ్దకాలానికి పైనే (దాదాపు 11సంవత్సరాల క్రితం) ఇక్కడ ఏర్పాటు చేయ వలసిన పశువుల వసతి గృహ సముదాయం అర్ధాంతరంగా నిలిచిపోయిన పిర్యాదు పై అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ప్రత్యేక చర్య తీసుకుని పూర్తి చేయుటకు నిర్ణయం తీసుకున్నట్టు పాడేరు పి అర్ ఈ ఈ టి కొండయ్యపడాల్ గురువారం తెలిపారు నల్లగొండ ను సందర్శించి ఇక్కడ అసంపూర్తిగా వదిలేసిన అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాం(2015, అకోబర్) ల ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం ఏంతో ప్రతిస్టాత్మకంగా అమలు చేయటపెట్టిన ఈ "పశువుల పెంపకం"రాష్టలోనే తొలిసారిగా రూఎన్ అర్ జి ఎస్ మరియు స్పేస్షల్ గ్రంటూ నుండి.2 కోట్ల వ్యయంతో నిర్మించేందుకు ఈ నల్లగొండ లో పనులను ప్రారంభించారు. అప్పటి ఐటిడిఎ పిఓ హరినారాయణ్ ఆధ్వర్యంలో ఈ పశువుల పెంపక షెడ్ల నిర్మాణం ప్రారంభించి దాదాపు 50లక్షల పనులను చేపట్టి అర్ధాంతరంగా నేటివరకు నిలిపేశారు. పదేళ్లుగా నిలిచిన వీటి పూర్తిపై గంపెడు ఆశలు పెట్టుకొన్న ఆ గ్రామ పాడి రైతులు ప్రస్తుత కలెక్టర్ కు పిర్యాదు చేయటంతో స్పందించిన కలెక్టర్ దినేష్ కుమార్ గురువారం సంబధిత శాఖ ఈ ఈ కొండయ్య, స్థానిక జె ఈసీహెచ్ రామకృష్ణల అధికార్లు నల్లగొండ లో అసంపూర్తిగా ఉన్న పశువుల పెంపక వసతి గృహ భవనాలను సందర్శించి పరిశీలించారు. అనంతరం ఈఈ కొండయ్య విలేకర్లతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఇక్కడ అసంపూర్తి భవనలను పరిశీలించమన్నారు. వీటి పూర్తికి తగిన చర్యలు తీసుకునేందుకు కలెక్టర్ చొరవ తీసుకున్నట్టు ఆయన తెలిపారు.ఈ ఈ సందర్భనలో జె ఈ ఈ రామకృష్ణ, పశువైద్యాధికారి కె. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర కమిటీ నియామకం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్రస్థాయి కార్యవర్గ కమిటీని గురువారం ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షులుమరిశర్ల మాలతీ కృష్ణమూర్తి నాయుడు ప్రకటించారు.గౌరవ అధ్యక్షులు గా భారతనంద స్వామీజీ, రాష్ట్ర అధ్యక్షులు గా జాగారపు ఈశ్వర ప్రసాద్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా అల్లు సత్యం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వంగల దాలినాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పంచిరెడ్డి కృష్ణారావు, మర్రిరాజుల నాయుడు, గంట జగన్నాథం నాయుడు, సిగడాం భాస్కరరావు, గొర్లి భానోజీరావు, రాష్ట్ర కార్య దర్శులుగా కొల్లాన గంగరాజు, చెల్లారపు వెంకట నాయుడు, పెట్ల అక్కు నాయుడు,వానపల్లి మురళీకృష్ణ, కోశాధికారిగా బలగ శంకర్రావు,ముఖ్య సలహాదారుగా జగన్నాథ్ ప్రసాద్ రాయిగురు, సమాచార హక్కు చట్టం కన్వీనర్ గా గవిరెడ్డి రఘు సత్య సింహ చక్రవర్తి, కో కన్వీనర్ గా సాధు కిరణ్ కుమార్, ఉద్యమ కమిటీ కన్వీనర్గా సంధ్య గజపతిరావు చౌదరి, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులుగా బి.నారా యణ మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శిగాబింగు రాజారావు, పార్వతిపురం జిల్లా అధ్యక్షులుగా శ్రీహరి, ఉపాధ్యక్షులు గా రేజేటి దయామణి, కార్యదర్శిగా వండాన నేతాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా చుక్క చంద్రరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులుగారెడ్డి అప్పలనాయుడు, విజయనగరం జిల్లా అధ్యక్షులుగా పోల శ్రీను, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులుగా దేవులపల్లి సీతారాం వట్నాయక్, అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులుగా వంతల నాగేశ్వరరావు తదితరులను నియమించినట్లు తెలిపారు.

అక్రమ ఫీజు వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

జిల్లా విద్యాశాఖ అన్ని విద్యాసంస్థలపై దర్యాప్తు చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అఖిల్

విశాలాంధ్ర-బెలగాం: జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు చేస్తూ రానున్న విద్యా సంవత్సరం ఫీజు ఇప్పుడే రిజర్వేషన్ కట్టించుకుంటున్న వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి. అఖిల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం పార్వతీపురం స్థానిక సుందరయ్య భవనంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల యజమానులు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ. 2వేలు నుంచి రూ.5 వేల వరకు రిజర్వేషన్ డబ్బులు వసూళ్లు చేస్తూ, పుస్తకాలు కొనుక్కోవాలని విద్యార్థులు తల్లిదండ్రులకు ఆదేశాలు జారీ చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాకమునుపే ప్రారంభ సమయానికి ఇంకో నెలరోజుల ముందు నుంచే డబ్బులు వసూలు చేస్తూ, పుస్తకాలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేయడం అన్యాయమన్నారు. ప్రధానంగా ప్రతి కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న చిన్నాచితక ఉద్యోగస్తులను ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రతి ఏరియాలో కాలనీలలో, ఇంటింటికి తిప్పుతున్నారని, అడ్మిషన్లు ప్రారంభిస్తున్నప్పటికీ జిల్లాలో అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడం అన్యాయమన్నారు. తక్షణమే ముందస్తు అడ్మిషన్లు ఆపాలని, పుస్తక ఫీజులు మరియు రిజర్వేషన్ ఫీజులను వసూలు చేస్తున్న అన్ని రకాల విద్యాసంస్థలపై దర్యాప్తు చేసి తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సురేష్, సాలూరు మండల కమిటీ సభ్యులు సందీప్, లక్ష్మణ్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి గిరిజన మహి బ్రాండ్ అంబాసిడర్ - వ్యవసాయాధికారి తిరుపతిరావు

విశాలాంధ్ర: -పాచిపెంట: వ్యవసాయ రంగంలో నేటి గిరిజన మహిళలు విత్తనం వేసిన దగ్గర నుండి కోత కోసే వరకు ప్రతి దశలోనూ తమ పనితీరును కనబరుస్తూ అధిక దిగుబడును సాధించడానికి కృషి చేస్తున్నారని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు అన్నారు . మండలంలో గల జీలుగువలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిఆర్పి కొండేటి సురేష్ ఆధ్వర్యంలో గురువారం జరిపిన రైతుల సమావేశంలో మాట్లాడుతూ గిరిజన మహిళలే ప్రకృతి సేద్యానికి బ్రాండ్ అంబాసిడర్ అని ఈ ఖరీఫ్ సీజన్లో పెద్ద ఎత్తున ప్రకృతి సేద్యాన్ని విస్తరించాలంటే గిరిజన మహిళల సహకారం లేకుండా సాధ్యం కాదని తెలిపారు. గిరిజన రైతులు గిరిజన సాంప్రదాయ పంటలైన చిరుధాన్యాల సాగును మరింతగా విస్తృతం చేయాలని ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుంది అని అన్నారు .చిరుధాన్యాల విత్తనాలు 90 శాతం రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. గట్లపై కంది మరియు కూరగాయలు వంటి వాటిని పండించుకోవాలని ఏక పంట కాకుండా అంతర పంటలు వేసుకోవాలని ఈ విషయమై మన ప్రక్కనే ఉన్న రెట్లపాడు గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవలసిన అవసరం ఉందని తెలిపారు. సర్పంచ్ ముఖి ఆనందరావు మాట్లాడుతూ కంది చిరుధాన్యాలు మరియు వరి విత్తనాలు త్వరగా అందించాలని కోరారు .తంగలాం గ్రామ పెద్ద సారా రాజు గిరిజన భాషలో ప్రకృతి సేద్య ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ప్రకృతి సేద్యానికి ప్రోత్సాహాన్ని అందించాలని కోరుతూ గ్రామ పెద్దలను సత్కరించారు ఈ కార్యక్రమంలో ప్రకృతి సేద్య ఐ సి ఆర్ పి లు చదల రాజు అప్పన్న గ్రామ వ్యవసాయ సహాయకులు కిరణ్ మరియు రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐటీడీఏ పీవో కు గిరిజనేతరులు వినతి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం: విఆర్ పురం, వడ్డిగూడెం రాజుపేట, రాజుపేట కాలనీ, చింతరేవుపల్లి గ్రామాలలో ఉన్న గిరిజనేతరులు తమ సమస్యలు పరిష్కరించాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ గురువారం వినతి పత్రము అందించారు. పోలవరం నిర్వాసితులమైన మాకు ప్రభుత్వమే ఇల్లు కట్టించి ఇవ్వాలి, ఎవరైనా ఇల్లు కట్టుకుంటాము అంగీకరిస్తే వారి ఇంటి నిర్మాణం కొరకు 7 లక్షల రూపాయలు ప్రభుత్వమే ఇవ్వాలి, ప్రతి నిర్వాసిత కుటుంబానికి పెరిగిన ధరలకు అనుగుణంగా ఆర్ అండ్ ఆర్ నష్టపరిహారం 12 లక్షల రూపాయలు ప్రభుత్వమే ఇవ్వాలి, నిర్వాసితులు కోరుకున్న చోట పునరావాస ఇల్లు కట్టించి మౌలిక సదుపాయాలు ఉపాధి అవకాశాలు కల్పించాలి. 5 పి యన్ నోటిఫికేషన్ వచ్చి రెండు సంవత్సరాల నర అవుతుంది. ఇంతవరకు మాకు ఆర్ అండ్ ఆర్ వర్తింప చేయలేదని 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నోటిఫికేషన్ రద్దు అవుతున్నందున కొత్త నోటిఫికేషన్ ఇచ్చి ఇప్పటికు 18 సంవత్సరాల నిండిన యువతి యువకులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింప చేయాలనీ ప్రతి నిర్వాసిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం పోలవరం ప్రాజెక్ట్ తన అనుబంధ ప్రాజెక్టులతో నిర్వాసితులకు 50 శాతం ఉద్యోగాలు ఇవ్వాలనీ ఆర్ అండ్ ఆర్ జాబితాలో రాని కుటుం బాలకు ఆర్ అండ్ ఆర్ లో చేర్చి వారికి నష్టపరిహారం అందించాలి. ముంపు గ్రామాలలో పిడిఎఫ్ కమిటీలు వేసి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ఆయా గ్రామాల నిర్వాసిత గిరిజనేతరులు తమ సమస్యలు పి ఓ దృష్టికి తీసుకొచ్చారు.

సాలూరు పండగ లో భద్రత కోసమే విద్యుత్ సరఫరా నిలిపి వేసాం...

వెల్లడించిన ఏపీ ఈపిడిసీఎల్ అధికారులు

విశాలాంధ్ర-పార్వతీపురం/సాలూరు: ఈనెల 19 నుండి 21 వరకు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలో నిర్వహించబడిన శ్యామలాంబ ఉత్సవం సందర్భంగా పత్రికలలో వచ్చిన వార్తా కథనాలపై ప్రచురణ నిమిత్తం సంబంధిత వివరాల నివేదికను ఈపీడీసీఎల్ అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. శ్యామలాంబ ఉత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ లోడును తట్టుకునేలా ప్రభుత్వం ముందస్తుగా రూ. 1.24 కోట్ల వ్యయంతో ఐదు 160 కెవిఏ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు, పద్నాలుగు 100 కెవిఎ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు, రెండు సింగిల్ ఫేజ్ ఫేజ్ 16 కెవిఎ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయబడినవి. ఇవి ఉత్సవానికి ముందే చార్జ్ చేయడం జరిగిందన్నారు. ఉత్సవ కాలంలో నిరంతర విద్యుత్ సరఫరా నిర్వహణ కోసం ఒక సూపరింటెండింగ్ ఇంజినీర్, ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఏడుగురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఆరుగురు అసిస్టెంట్ ఇంజినీర్లు, ఆరుగురు జూనియర్ ఇంజినీర్లు, 57 మంది ఓ అండ్ ఎం సిబ్బంది నియమించబడ్డారు. వారు వారి విధుల్లో అప్రమత్తంగా ఉండి ఎటువంటి అంతరాయాలు లేకుండా పర్యవేక్షణ చేయుచున్నారు. ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్కి సమాచారం ఇస్తూ అప్రమత్తం గా ఉన్నారని,లోడ్ మానిటరింగ్ సెల్ , కంట్రోల్ రూమ్లను సాలూరు ఉప విభాగ కార్యాలయం, సర్కిల్ కార్యాలయం మరియు కార్పొరేట్ కార్యాలయంలో 24x7 ఏర్పాటుచేసి, విద్యుత్ సరఫరా స్థితిని నిరంతరం పర్యవేక్షించడం జరిగిందన్నారు. ఉత్సవంలో భాగంగా తేది 20.05.2025 సాయంత్రం 4 గంటల నుండి తేది 21.05.2025 ఉదయం 4 గంటల వరకు వీధులలో రథం తిరిగే సమయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు భద్రత చర్యల నిమిత్తము కొన్ని వీధుల్లో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయడం జరిగిందనీ తెలిపారు. శ్యామలాంబ ఉత్సవం 15 సంవత్సరాల తర్వాత జరుగుతుండటంతో పట్టణంలో భారీగా లక్షల సంఖ్యలో సాలూరు ప్రజల బంధువులు పెద్దఎత్తున తరలి వచ్చారు. ఈ సమయంలో విపరీతంగా ఎయిర్ కండిషనర్లు, ఎయిర్ కూలర్లు, వాటర్ మోటార్లు, మిక్సీలు మరియు గ్రైండర్లు వాడటం వల్ల ట్రాన్స్ఫార్మర్ల పై లోడ్ భారీగా పెరిగి, సెక్షన్ ఫ్యూస్లు, ట్రాన్స్ఫార్మర్లు కాలిపోవటం జరిగింది. కొన్ని చోట్ల కేబుల్ వైర్స్ షార్ట్ అయ్యి కాలిపోవటం జరిగింది, ఇవన్నీ అధికారులు మరియు ఓ అండ్ ఎం సిబ్బంది సమన్వయం చేసుకొని వెంటనే పరిష్కరించడం జరిగిందన్నారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు పై అధిక లోడుతో పాటు, ఉత్సవ సమయంలో భారీ వర్షాలు కూడా చోటుచేసుకొన్న ఫలితంగా ఐదు 100 కె వి ఏ ట్రాన్స్ఫార్మర్లు, మూడు 40 కేవిఏ ట్రాన్స్ఫార్మర్లు, రెండు సింగిల్ ఫేజ్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న మొత్తం పది డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లను వెంటనే మార్చడం ద్వారా త్వరితగతిన విద్యుత్ ను పునరుద్ధరించడం జరిగిందన్నారు. ప్రభుత్వ అధికారులు , మంత్రి ఆదేశాలను ఎప్పటికప్పుడు పాటిస్తూ పార్వతీపురం మన్యం విద్యుత్ అధికారులు సిబ్బంది వినియోగదారుల కు నిరంతర విద్యుత్తు సరఫరా కోసం పనిచేస్తునే ఉన్నారని తెలియ చేయుచున్నామన్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామి పూజలు

విశాలాంధ్ర -కొయ్యూరు: మండలంలో అభయాంజనేయ స్వామి పూజలు గ్రామగ్రామాన అంగరంగ వైభవంగా జరిగాయి అభయాంజనేయ స్వామి జయంతి సందర్భంగా ఈరోజు కొయ్యూరు గ్రామంలో ఆంజనేయస్వామికి శర్మ పంతులుగారు అభిషేకం పూజా కార్యక్రమం జరిపించారు. అలాగే అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో అనిశెట్టి చిరంజీవి మేడు బోయినచిన్న మాకాడ బాలరాజు ప్రభుదాస్ గాలి దేవుడు గంగిశెట్టి సుబ్బారావు అనిశెట్టినాగేశ్వరరావు వజ్రప్రసాద్ రాము గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ మండల సమావేశంలో పలు అంశాలపై తీర్మాణం

ముఖ్య అతిథిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి

విశాలాంధ్ర-జీ.మాడుగుల: స్థానిక జెడ్పీ గెస్ట్ హౌస్ వద్ద టిడిపి నాయకులు కార్యకర్తలు సమావేశం అయ్యారు. టీడీపీ పార్టీ మండల ఉపాధ్యకులు పాటి భీంబాబు అధ్యక్షతన పార్టీలో నెలకొన్న సమస్యల పైన సమావేశం నిర్వహించరు. పార్టీ సమావేశలు నిర్వహించక పోవటం, క్రియా శీలకంగా పని చేస్తూన్న వారిని పట్టించుకోక పోవటం, ఎన్నికల తర్వాత కార్యకర్తలను వదిలి వేయటం చాలా దారుణం కార్యకర్తలు వాపోయారు. జి మాడుగుల టిడిపి కార్యకర్తలకు టీడీపీ అధిష్టానమే ప్రతి పక్షం గా ఉన్నట్లు భావిస్తున్నారు. స్వార్థ రాజకీయాలతో పార్టీ లో సీనియర్లను, కష్టపడ్డా కార్యకర్తలు లకు గుర్తింపు లేకుండా చేస్తున్నారు. గ్రూప్ రాజకీయలు చేస్తూ కష్టపడ్డా వారిని పక్కన పెడుతున్నారు. గ్రామ కమిటీలు నియమించటం లో కూడా స్వార్థ బుద్ధితో ఎవ్వరికి చెప్పకుండా కమిటీలు అధిష్టానానికి పంపటం, మండల సమావేశలకు వెళ్ళకండి అని ఫోన్ చేసి చెప్పటం, కొద్దీమంది పార్టిలో చేస్తున్న తప్పిదాలకు కార్యకర్తలు సతమతమవు తున్నారు. ఇదే విధంగా కొనసాగితే పార్టీలో నాయకులు తప్ప కార్యకర్తలు ఉండరు అని తెలిపారు. పార్టీ ఇచ్చే పదవీ కోసం ఇతర నాయకులను దూరం చేస్తూ, వారి పై తప్పుడు ప్రచారం చేయడం పార్టీలో నాయకులు మనుకోవాలన్నారు. మాజీ మంత్రి మత్స్య రాస మణి కుమారి మాట్లాడుతూ ప్రతి విషయాన్ని అధిష్టానం దృష్టికి పెడుతున్నామన్నారు. ఎవరు అధైర్య పడొద్దు అని వర్గ రాజకీయలకు దూరంగా ఉండాలి తెలిపారు. తను మంత్రిగా చేసినపుడు పార్టీలో ఇటువంటి సందర్భంలో లేవని, ఈ మద్య కాలంలో ఇలాంటివి వస్తున్నాయి అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు ప్రజలకి తెలియజేయాలన్నారు. ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు సోమెలి చిట్టిబాబు మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికలు కు సంబంధించి అభ్యర్థులు ప్రజల్లోకి వెళ్లాలని తెలిపారు. కార్యకర్తలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని అధిష్టానానికి తెలియజేస్తామన్నారు. 2 సంవత్సరాల నుండి మండల సమావేశం జరగకపోవడం వలన ఈ రోజు జరిగిన మండల సమావేశానికి మండల అధ్యక్షులు రాకపోవటం చర్చ నియంశంగా మారిందన్నారు. మండల బాడీ ఎన్నికలు మండల పరిధిలో కార్యకర్తలు అభిప్రాయంలతో, జరగాలనీ వేరే మండల నాయకులు జోక్యం ఉండకూడదన్నారు. పైన పేర్కొన్న విషయాల మీద పలు అంశాల మీద తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో 17 పంచాయతీల మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, సీనియర్ నాయకులు,యూనిట్ ఇన్చార్జిలు, బూత్ ఇన్చార్జులు, కార్యకర్తలు, పాల్గొన్నారు

గిరిజన సలహా మండలి(టిఎసి)లో మైదాన

గిరిజనులు వద్దు : ఆదివాసీ పార్టీ

విశాలాంధ్ర-జీకే వీధి : గిరిజన సలహా మండలి(టీఏసి)లో మైదాన గిరిజనులు వద్దని భారత్ ఆదివాసీపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపారు. 5వ షెడ్యూల్ భూభాగంలో విధాన పరమైన నిర్ణయాలు తీసుకోవడానికి 1950 జనవరి 26వ తారీఖున రాజ్యాంగంలో గిరిజన సలహా మండలి(టీఏసి)ని రాష్ట్ర ప్రభుత్వం అధ్వర్యంలో ఏర్పాటుకు ఆమోదించబడింది. గిరిజన సలహా మండలిలో చైర్మన్ మరియు సభ్యులు 5వ షెడ్యూల్ ప్రాంతానికి చెందిన ఆదివాసీలైతేనే 5వ షెడ్యూల్ భూభాగంలో విధాన పరమైన నిర్ణయాలు సరిగ్గా ఉంటాయి. ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వం ఏర్పాటై సంవత్సర కాలం తర్వాత ఆదివాసీల డిమాండ్ తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన గిరిజన సలహా మండలిలో మైదాన ప్రాంతానికి చెందిన గిరిజనులు సభ్యులుగా ఉన్నారు. వాస్తవానికి రాజ్యాంగంలో 5వ షెడ్యూల్,గిరిజన సలహా మండలి ఏర్పాటు సమయంలో వారు గిరిజనులే కాదు. రకారకాల కారణాలతో వారు గిరిజన జాబితాలోకి చేరి గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ లను అనుభవిస్తున్నారు. దీంతో నిజమైనా,అమాయకమైన ఆదివాసీలు తీవ్రంగా నష్టపోతున్నారని,రాజ్యాంగంలో 5వ షెడ్యూల్,గిరిజన సలహా మండలి 5వ షెడ్యూల్ భూభాగంలో నివశించే వారి కోసం తప్పా మైదాన గిరిజనుల కోసం కాదని,5వ షెడ్యూల్ తో సంబంధం లేని మైదాన గిరిజనులు సభ్యులుగా ఉన్న గిరిజన సలహా మండలితో 5వ షెడ్యూల్ భూభాగంలో నివసించే ఆదివాసీల భవిష్యత్తుకు నష్టం జరుగుతుందని,ఈ గిరిజన సలహా మండలి ఏర్పాటుపై ఆదివాసీలు హర్షం వ్యక్తం చేయడం లేదని,గవర్నర్,ముఖ్యమంత్రి పునరాలోచన చేసి గిరిజన సలహా మండలిలో సభ్యులుగా ఉన్న మైదాన గిరిజనులు తొలగించి,5వ షెడ్యూల్ ప్రాంత ఆదివాసీలను గిరిజన సలహా మండలి సభ్యులుగా నియమించాలని,మైదాన ప్రాంత గిరిజనులకు మైదానంలో ఉన్న ఐటీడీఏ డైరెక్టర్లుగా,మైదానంలో వివిధ పదవులలో నియమించి సముచిత గౌరవం ఇవ్వాలని భారత్ఆదివాసీపార్టీగా కోరుతున్నామన్నారు.

సుప్రీం కోర్ట్ సూచన ల కు అనుగుణంగా నే

పోలవరం నేషనల్ పార్క్ ఏర్పాటు చేస్తాం..!

విశాలాంధ్ర-రంపచోడవరం: పోలవరం ప్రాజెక్ట్ పాపికొండల నేషనల్ పార్క్ కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం సుప్రీం కోర్ట్ నిబంధనల ప్రకారం ఏకో అడవి పరిరక్షణ జోన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వారి ఛాంబర్ లో పాపికొండల నేషనల్ పార్క్ విధివిధానాలపై అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, చీఫ్ కన్సలేటర్ ఫారెస్ట్. బిఎన్ఎన్ మూర్తి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, డివిజనల్ ఫారెస్ట్ అధికారులు రవీంద్ర ధామ, భవిత జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ గౌరవ సుప్రీంకోర్టు గైడెన్స్ ప్రకారం అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం పోలవరం ప్రాజెక్ట్ పాపికొండల నేషనల్ పార్కు ఏర్పాటు చేయుటకు సంబంధిత గ్రామాలలో గ్రామ సభలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఏకో అడవి పరిరక్షణ జోన్ కి పది కిలోమీటర్ల దూరంలో బౌండరీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. రంపచోడవరం దేవీపట్నం మారేడుమిల్లి మండలలో 10 గ్రామాలు, చింతూరు డివిజన్లో 12 గ్రామాలు నేషనల్ పార్క్ లో మొత్తం 22 గ్రామాలు కలుస్తున్నాయని ఆయన అన్నారు. నేషనల్ పార్కు లో కలుస్తున్న గ్రామాలలో గ్రామ సభలు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు అదేవిధంగా గ్రామ సభలు ఏర్పాటు చేయుచున్న గ్రామాలకు ముందుగా నోటీసులు జారీ చేయాలని ఆయన అన్నారు. ముందుగా రెవిన్యూ ల్యాండ్ ఫారెస్ట్ ల్యాండ్ గుర్తించాలని ఆయన అన్నారు. టూరిజం ప్రాంతంలో వివిధ శాఖలు ఇన్వాల్వ్ అవ్వాలని ఆయన అన్నారు. ఈ నేషనల్ పార్క్ ప్రాంతాల్లోని గిరిజనుల స్థితిగతులు తెలుసుకోవాలని అదేవిధంగా ఎన్జీవోలను కూడా ఇన్వాల్వ్ చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. వెబ్ లైనుకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని ఆయన అన్నారు. ఈ నేషనల్ పార్క్ ప్రాంతంలో ఎన్ని జోన్లు ఏర్పాటు చేయుచున్నది ఆయన ఆరా తీశారు. ఈ నేషనల్ పార్క్ ప్రాంతంలో ఎంతమంది రైతులు ఉన్నది అదేవిధంగా ఎంతమంది గిరిజన రైతులకు ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు మంజూరు చేసింది ఆయన ఆరా తీశారు. పాపికొండల నేషనల్ పార్క్ ప్రాంతంలో ఎక్కడెక్కడ మైనింగ్ ఉన్నది ఆయన ఆరా తీశారు. ఈ నేషనల్ పార్క్ ప్రాంతంలో ఎన్ని కుటుంబాలకు అవార్డులు మంజూరు చేయవలసి ఉంటుంది ఆయన ఆరా తీశారు. నేషనల్ పార్క్ ప్రాంత గ్రామాలలో త్వరితగతిన గ్రామ సభలు నిర్వహించాలని డి ఎల్ పి ఓ పద్మను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో సబ్ డీఎఫ్ఓలు అనుష, రాఘవ, ఫారెస్ట్ రేంజ్ అధికారులు ఏడుకొండలు, ఫిరోజ్, డి. కొండలరావు. ఈఈ. ఐ.శ్రీనివాసరావు, ఏడిఏలు సిహెచ్ కెవి చౌదరి, కే.సావిత్రి, డిఈ సాయి సతీష్, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, ఎన్జీవో నాయకులు గూళ్లే అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు భూములు ఏర్పాటు

కోసం సత్వర చర్యలు

విశాలాంధ్ర-రంపచోడవరం : పోలవరం ప్రా జెక్టు ముంపు బాధితులకు ఆర్ అండ్ ఆర్ నిబంధన ప్రకారం ల్యాండ్ టు ల్యాండ్ గిరిజనులకు ఏర్పాటు చేయడం జరుగుతుందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం సాయంకాలం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో, తాసిల్దార్లతో, డిప్యూటీ తాసిల్దారులతో, సర్వేర్లతో, వీఆర్వోలతో, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్లతో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ సమావేశం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, ఎల్ఎంసి స్పెషల్ కలెక్టర్ సరళ వందనం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు గిరిజన ముంపు బాధితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ ద్వారా ల్యాండ్ టు ల్యాండ్ అదేవిధంగా ముంపు బాధితులకు ఆర్అండ్ఆర్ కాలనీలు ఏర్పాటు చేయుటకు ముఖ్యంగా చింతూరు డివిజన్లో ప్రభుత్వ భూములు, ప్రైవేట్ భూములు గుర్తించాలని ఆయన అన్నారు. ముంపు బాధిత గిరిజనులకు

వ్యవసాయానికి అణువుగా ఉన్న భూములను ప్రైవేట్ భూములు ప్రభుత్వ భూములు సర్వే నెంబర్లతో సహా గుర్తించాలని ఆయన అన్నారు. ఈ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ నిబంధన ప్రకారం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. నేషనల్ హైవే 516 ఇ రోడ్డుకు ఇరువైపులా బాధితులకు ప్యాకేజీ అమలుపై ఆయన ఆరా తీశారు. బ్రోకర్ల ప్రమేయం లేకుండా ప్రైవేట్ భూములు గుర్తించాలని అదేవిధంగా ఏ సపోర్ట్ కావాలన్నా ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. సర్వే టీంలు, రెవెన్యూ టీములు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆన్లైన్ ఆఫ్లైన్లో సర్వే చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అంబేద్కర్, వెంకటేశ్వర్లు, నరసయ్య, తాసిల్దార్లు సిహెచ్ శ్రీనివాసరావు, కె. సూర్యనారాయణ,ఏవి సత్యనారాయణ, డిప్యూటీ తాసిల్దారులు తేజస్విని, భాష, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, వీఆర్వోలు, సర్వేర్లు తదితరులు పాల్గొన్నారు.

జీవవైవిధ్య రక్షక్' అవార్డు అందుకున్న గిరిజన వికాస్

కార్యదర్శి ఎన్. సత్యనారాయణ

విశాలాంధ్ర చింతపల్లి : ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డ్ ద్వారా అందించే జీవ వైవిధ్య రక్షక్ అవార్డును గిరిజన వికాస్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఎన్.సత్యనారాయణ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం లో గురువారం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, అటవీ,పర్యావరణ,గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా అందుకున్నారు. మే 22 గురువారం నాడ్జు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా జరిగిన ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎపి బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ ఎన్. విజయ్ కుమార్, ఎపి బయోడైవర్సిటీ బోర్డు మెంబర్ సెక్రటరీ రామకృష్ణ, అటవీ శాఖ ఉన్నతాధికారులు సత్యనారాయణను శాలువ కప్పి,జ్ఞాపికతో అవార్డును బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. గిరిజన వికాస్ సంస్థ వ్యవస్థాపకులైన ఎన్. సత్యనారాయణ గత కొన్ని దశాబ్దాలుగా జి.కె. వీధి, చింతపల్లి, కొయ్యూరు మండలాల గ్రామాల్లో జీవవైవిధ్య పరిరక్షణ, గిరిజనుల జీవనోపాధులు, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేస్తూ విశేషంగా కృషి చేస్తున్నారు. గిరిజన రైతులను సహజ వ్యవసాయం, సేంద్రీయ పద్ధతులు అనుసరించేందుకు శిక్షణలు, ఆర్థిక సహాయం, వివిధ రకాల ప్రోత్సాహక కార్యక్రమాల ద్వారా జీవవైవిధ్య పరిరక్షణకు కృషి చేశారు. నాబార్డు మాతోట పథకం ద్వారా వందలాది ఎకరాల్లో మామిడి, లిచ్చీ, సీతాఫల తోటల పెంపకానికి విశేష కృషి చేశారు. అంతర పంటల ద్వారా జీవ పరిసర సమతుల్యత సాధనకు కృషి చేశారు. ఉపాధి హామీ, అటవీ శాఖ పథకాల సాయంతో నీరు, నేల పరిరక్షణకు పాటుపడ్డారు. జీవవైవిధ్య పరిరక్షణలో భాగంగా ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన పిల్లల కోసం వ్యాసరచనలు, డిబేట్లు, ఆడియో-విజువల్ ప్రదర్శనలు నిర్వహించారు. మాతోట, ఆంధ్ర కశ్మీర్, మన్యతోరణ వంటి గిరిజన రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసి, వారికి సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేసేందుకు మార్గదర్శనం అందించడం ద్వారా మంచి ఫలితాలు సాధించేందుకు సహకరించారు. గిరిజన సహకార సంస్థకు కాఫీ సరఫరా విషయంలో వేలాది ఎకరాల్లో సేంద్రియ ధ్రువీకరణ చేపడుతూ జీసిసి కాఫీకి విశిష్టమైన బ్రాండింగ్ను కల్పించారు. ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డు తనను 'జీవవైవిధ్య రక్షక్' అవార్డు అందుకోవడంపై గిరిజన వికాస్ సంస్థ కార్యదర్శి సత్యనారాయణ సంతోషం వ్యక్తం చేశారు. ఈ గుర్తింపు తమ సంస్థ పరిధిలో గిరిజనుల జీవనోపాధులు మరియు జీవవైవిధ్య రక్షణ కోసం పాటుపడుతున్న ప్రతి ఒక్కరికి లభించిన గౌరవంగా భావిస్తున్నట్టు తెలిపారు. అలాగే తమ సంస్థ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఈ గౌరవం చెందుతుందని పేర్కొన్నారు.

ఎట్టకేలకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: ఎట్టకేలకు ప్రమాదాలు జరిగి, ప్రాణాలు కోల్పోయిన తర్వాత పోలీస్ శాఖ మేల్కొని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసింది. మండలంలోని తాళ్లబరిడిమీదుగా లచ్చిరాజుపేట పులిగుమ్మి గ్రామాలను కలుపుతూ ప్రవహిస్తున్న సాకి గడ్డ లో ఈత కోసం దిగి ఇటీవల ఇద్దరు ఇంటర్మీడియట్ విద్యార్థులు మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో మేల్కొన్న పోలీస్ శాఖ రూరల్ ఎస్సై సంతోషి ఆధ్వర్యంలో గడ్డ పరివాహక ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసింది. ముఖ్యంగా ఉధృతంగా ప్రవహించే సాకీ గడ్డ పులిగుమ్మి గ్రామం వద్ద విశాలంగా, ఆహ్లాదకర వాతావరణంలో ఉంటుంది. దీంతో అక్కడి యువకులు సమీప గ్రామాల వారు వచ్చి స్నానాలు చేయడం

ఆనవాయి తీగా వస్తుంది. నీటి ఉధృతి తెలుసుకోకుండా సరదా కోసం స్నానాలకు వెళ్లి ప్రాణాలు కోల్పోతుండడంతో మేల్కొన్న పోలీస్ శాఖ ఆయా పరివాహక ప్రాంతాల్లో గురువారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే ఈ హెచ్చరిక బోర్డులో ముందస్తుగానే ఏర్పాటు చేసి ఉంటే ప్రాణ నష్టం జరిగేది కాదని గ్రామస్తులు అంటున్నారు. ..

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-రంపచోడవరం : అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ కేంద్రంలో వేంచేసి ఉన్నటువంటి శ్రీ విరాట్ విజయ ఆంజనేయ స్వామి సహిత శ్రీ కోదండ రామాలయం ప్రాంగణంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీయజ్ఞ సూర్యసాయికిరణ్ స్వామివారికి అభిషేకములు ప్రత్యేక పూజలు జరిపించారు సూరిశెట్టి కృష్ణ భక్తులకు ప్రసాదములు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యేశీతంశెట్టి వేంకటేశ్వరరావు, కిషోర్ , అబ్బులు , అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించారని ధర్మప్రచార భక్తమండలి సమన్వయకర్త నల్లమిల్లి వేంకట రామారెడ్డి తెలియజేశారు.

ఉపాధ్యాయ బదిలీల వెబ్సైట్ వేగాన్ని పెంచాలి

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్

విశాలాంధ్ర-బెలగాం: రాష్ట్రంలో మొట్టమొదటిసారి బదిలీల చట్టాన్ని అనుసరించి జరుగుతున్న బదిలీల ప్రక్రియలో ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తు చేయడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కావున సర్వర్ యొక్క వేగాన్ని పెంచాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్ల బాలకృష్ణ, మహేష్ ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఏఏ పాఠశాలల్లో ఏఏ పోస్టులు అదనంగా ఉన్నాయో ఈ జాబితాల ద్వారా తెలుస్తుందని తద్వారా సంబంధిత ఉపాధ్యాయులు బదిలీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని కావున ఉమ్మడి విజయనగరం జిల్లాకు సంబంధించి ఉపాధ్యాయుల రీఅపోర్షన్ మెంట్ వివరాలు వెంటనే అందజేయాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు. న్యాయస్థానాల ఉత్తరువులను అనుసరించి బెంచి మార్క్ వ్యాధులు గల ఉపాధ్యాయులకు ఈ బదిలీ నియమాలు వర్తించవనీ, అయితే సంబంధిత వ్యక్తులు వారికి అంగీకారం అయితే బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చని వారు తెలియజేశారు.

గిరిజన సలహా మండలి కమిటీలో

విశ్వేశ్వర రాజుకు గలాన్ని వినిపించే అవకాశం

విశాలాంధ్ర-చింతపల్లి: ఆంధ్రపదేశ్ గిరిజన సలహామండలిని పునర్నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులలో పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజును సలహా మండలి సభ్యునిగా నియమించడం హర్షణీయమని స్థానిక మండల కోఆప్షన సభ్యుడు. షేక్ నాజర్ వల్లి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పునర్ నియమించిన గిరిజన సలహా మండలి లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి చైర్మన్ గా ఉండే గిరిజన సలహా మండలి లో పాలకొండ, కురుపాం, రంపచోడవరం పోలవరం, అరకు శాసనసభ్యులతో పాటు పాడేరు శాసనసభ్యునికి చోటు దక్కడం హర్ష నీయం అన్నారు. గిరిజనుల సమస్యలపై కమిటీలో తన గలాన్ని వినిపించేందుకు పాడేరు శాసనసభ్యునికి అవకాశం లభించడం సంతోషకరమన్నారు. గిరిజన సలహా మండలి సభ్యునిగా నియమితులైన విశ్వేశ్వర రాజుకు ఈ సందర్భంగా పత్రికా ముఖంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

జీడి ప్రాసెసింగ్ యూనిట్ పనులను

పర్యవేక్షించిన కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పట్టణ పరిధిలోని మార్కెట్ యార్డ్ యందు నిర్మించబోతున్న జీడి ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి ఆయన పలు సూచనలు, మార్గదర్శకాలతో దిశా నిర్దేశం చేశారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. నాణ్యమైన జీడి పిక్కలను కొనుగోలు చేయాలని, బ్రాండింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్శనలో జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ మణిరాజ్, ఏపీఓ మురళీధర్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పట్టణ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద గల ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా గురువారం ఆయన గోదాములను సందర్శించి అక్కడ పరిస్థితిని గమనించారు. గోదాములకు వేసిన సీళ్లను ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిష్టరులో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తూ, ఏర్పాట్లపై పరిశీలించి అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, తహసీల్దార్ వై. జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర- ముంచంగి పుట్టు : మండల పరిధిలో పలు గ్రామాలలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సుజనకోట పంచాయతీ కేంద్రంతో పాటు మండల కేంద్రంలో గల స్థానిక శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయాలలో గురువారం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు, హెూమాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. సుజజనకోట గ్రామంలో టోంగి కృష్ణమూర్తి ముత్యాలమ్మ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ అన్నసమారాధన కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు. మొదటి సారి అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించిన కృష్ణమూర్తి ముత్యాలమ్మ దంపతులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జోలాపుట్టు,దొడిపుట్టు,బొంద్రుగూడ,కిలగాడ గ్రామాల్లో సైతం భక్తులు హనుమాన్ జయంతిని కనుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుజనకోట గ్రామ నాయుడు ఎస్.మురళీ, పీసా కమిటి సభ్యులు కె.దామోదరం, కె.సింహాచలం, వార్డ్ మెంబర్ టీ.రుక్మన్, గ్రామపెద్దలు ఎ.కొండయ్య కె.రాధాక్రిష్ణ ఎం.త్రినాధ్ లతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం లో విఆర్ఓ భర్త మృతి

విశాలాంధ్ర-వై.రామవరం: మండలం లోని పనసల పాలెం చవిటి దిబ్బలు గ్రామాల మధ్య జరిగిన రోడ్డుప్రమాదం లో వై.రామవరం విఆర్ఓ మిడియం కాంతమ్మ భర్త చోడి సీతారామయ్య(35) మృతి చెందారు. బుధవారం రాత్రి చవిటి దిబ్బలు వైపు నుండి వై.రామవరం వస్తుండగా ఈ ప్రమాదం జరగగా కల్వర్టు క్రింద ఉన్న మృతదేహాన్ని గురువారం పోలీసులు గుర్తించారు. స్కూటీ అదుపు తప్పిందా లేక వేరే వాహనం ఢీకొట్టిందా అనేదాని పై అనుమానాలు నెలకొన్నాయి. మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేశామని మృతుని భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

కొయ్యూరు లో భారీగా తిరంగా ర్యాలీ

రాష్ట్ర ట్రై కార్ డైరెక్టర్ కృష్ణారావు

గిరిజన సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు

విశాలాంధ్ర-కొయ్యూరు: పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు అమాయక ప్రజలపై దాడి చేసిన ఘటనకు భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆపరేషన్ సింధూర్ పేరుతో దీటైన సమాధానం ఇచ్చారని రాష్ట్ర ట్రైకర్ డైరెక్టర్ కూడా కృష్ణారావు, గిరిజన సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు కురసా ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం మండల కేంద్రమైన కొయ్యూరు నుండి రాజేంద్ర పాలెం వరకు భారీఎత్తున తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు ఉమామహే శ్వరరావు మాట్లాడుతూ పాకిస్తాన్ ఎన్ని కుట్రల చేసిన భారత సైనికు లు ధైర్యంగా ఎదిరించి పోరా డిన తీరును కొనియాడారు . దేశ ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి. నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు ఈ యాత్ర చేపట్టడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో రాజేంద్రపాలెం సర్పంచ్ పీతా సింహాచలం, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గూడెం లక్ష్మణ్, భారతీయ జనతా పార్టీ నాయకులు మేడిపోయిన చిన్న, సుబ్రమణ్యం, జనసేన పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు భావన సాయి జయంతి పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ పై ఆందోళన

విశాలాంధ్ర-సీలేరు: అన్నదాత సుఖీభవ పథకం ఆన్లైన్ రిజిస్ట్రేషన్ కొరకు ఎవరు పేరు మీద పట్టా ఉందో వారికి మాత్రమే రిజిస్ట్రేషన్ అవుతుంది. అయితే తండ్రులు చనిపోయి తండ్రుల పేరు మీద నామిని పెట్టుకున్న వారికి అన్నదాత సుఖీభవ పథకము వర్తించదని అగ్రికల్చర్ మేడం చెప్పడం జరిగింది. మరి గత ప్రభుత్వంలో నామినీ ఉన్న రైతులకు కూడా రైతు భరోసా అనే పథకం వర్తింప చేశారు. కానీ కూటమి ప్రభుత్వము ఏర్పడ్డాక పెట్టినటువంటి అన్నదాత సుఖీభవ పథకంలో ఎవరైతే నామిని రైతులు ఉన్నారో అలాంటివారికి వర్తించటము లేదు . ఇటువంటి నామిని రైతులకు కూడా ఈ పథకంలో భాగంగా చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఈ కార్యక్రమానికి (వార్డు మెంబర్) కిలో ఆంజనేయుడు (పిసా మండల కార్యదర్శి) కిలో ధర్మారావు, దారకొండ గ్రామపంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-కురుపాం: కురుపాంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆలయ ధర్మకర్త గుడ్ల విజయకుమార్ ఆధ్వర్యంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష పూజలు ,సీతారాముల కళ్యాణం చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆకుల రామమోహనరావు భక్తులకు అన్న ప్రసాదాలను అందజేశారు.

నూతన ఆలయంలో సీతారాముల కళ్యాణం: బియ్యాలవలస పంచాయతీ మూలిగూడ జంక్షన్ లో నూతనంగా నిర్మించి గత మూడు రోజులు రంపా కోదండరామ్ శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్టాకార్యక్రమాలు నిర్వహించి హనుమజ్జయంతి సందర్భంగా సీతారాముల కళ్యాణం చేపట్టారు. పరిశర గ్రామాల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జిసీసీ ఎంఎల్ఎస్ గోదాం సూపరింటెండెంట్గా

రామమూర్తి బాధ్యతలు

విశాలాంధ్ర-ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు మండలం కేంద్రంలో గల గిరిజన సహకార సంస్థ ఎంఎల్ఎస్ గోదాము సూపర్డెంట్ గా మొస్య రామమూర్తి గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇదే ఎంఎఫ్ పి కాఫీ గోదాములో ఇంఛార్జిగా విధులు నిర్వహించిన ఆయనను రాష్ట్ర ప్రభుత్వం గోదాము సూపర్డెంట్ గా ఆయనకు నియమించింది. దీంతో గురువారం జి సి సి గోదాములో ఆయన పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గోదాము ఇంచార్జి రామమూర్తి మాట్లాడుతూ గిరిజన సహకార సంస్థ అభివృద్ధికి తన వంతు కృషి చేయడమే కాకుండా మండలంలో గల డిఆర్ డిపోలలో సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ జరిగేలా తన వంతు కృషి చేస్తానన్నారు. అదే విదంగా జిసిసి గోదాము ద్వారా డిఆర్సీ అన్ని నిత్యావసర సరుకులు ప్రజలకు తక్కువ ధరలకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు చేవడతామని ఆయన అన్నారు. అనంతరం జిసిసి సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికికారు.

ప్రభుత్వనికి చెడ్డపేరుతెస్తే చర్యలు తప్పదు:రాష్ట జిసిసి

చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్



విశాలాంధ్ర-పార్వతీపురం: ప్రభుత్వానికి ఎవ్వరూ చెడ్డపేరు తెచ్చే విధంగా పనిచేయ వద్దని ఒకవేళ ఎవరైనా చెడ్డ పేరుతెస్తే ఖచ్చితంగా చర్యలు తప్పవని రాష్ట్ర జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ తెలిపారు. గురువారం పార్వతీపురం మన్యం జిల్లా జిసిసి కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి హెబిటేషన్లో రైతులకు ప్రజలకు జీసిసి ద్వారా నిత్యవసర సరుకులు అందించే కార్యక్రమం జరుగుతుందని, దానికి ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎక్కడ అవకతవకాలు జరిగిన చర్యలు తప్పవని ప్రతిఒక్కరు బాధ్యతతో పనిచేయాలని ఏసమస్యలున్న తనదృష్టికి తీసుకురావాలని తెలిపారు. జిసిసి ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్ళటానికి సిద్ధంగా ఉన్నానని, కాంట్రాక్టు ఉద్యోగుల విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్ళినట్లు తెలిపారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండే విధంగా జిసిసి ఉద్యోగస్తులు సేవలు ఉండాలని, ప్రజలతో మమేకమవుతూ జిసిసి నుండి అందిస్తున్న సరుకులు నేరుగా ప్రజలకు అందే విధంగా చూడాలని కోరారు. జిసిసి అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎన్నడూ లేని విధంగా జిసిసి ఉద్యోగస్తులను అనేకమందికి ప్రమోషన్స్ ఇవ్వడం జరిగిందన్నారు. జిసిసిపై ప్రజల్లో నమ్మకం కలిగించాలని, ప్రజలు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులు జిసిసి కొనుగోలుచేసే విధంగా అధికారులు వ్యవహరించాలని,రైతులకు ఎప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ఇప్పటికే అరకుకాఫీను ప్రపంచ స్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకువెళ్లారని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర,టిడిపి నాయకులు పాండురంగ స్వామి సుబ్బారావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గొట్టాపు వెంకట నాయుడు, జీ రవికుమార్ పట్టణ పార్టీ అధ్యక్షులు,నాయకులు బోను చంద్రమౌళి , రౌతు వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పేజీ: 4
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
శుక్రవారం 23, మే 2025

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర ..అడ్డతీగల: అడ్డతీగల మండలం వేటమామిడి గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన హనుమాన్ గుడి ప్రారంభోత్సవాన్ని వేటమామిడి గ్రామస్తులు , మరియు చుట్టుపక్కల గ్రామస్తులు కలిసి ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించి అన్నదానాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో అల్లూరు జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి ఈరోజు స్వప్న కుమారి కుటుంబ సమేతంగా హనుమాన్ ని ప్రత్యేక పూజలు చేశారు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామ పెద్దలు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు

తెలుగుజాతి ఉన్నంతవరకు తెలుగుదేశం పార్టీకి ప్రజాదరణ

అరుకుపార్లమెంటు మహానాడులో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి

విశాలాంధ్ర-పార్వతీపురం: తెలుగు జాతి ఉన్నంతవరకు తెలుగుదేశం పార్టీకి తిరుగులేని ప్రజాదరణ ఉంటుందని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ,స్త్రీ శిశు సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలోని సౌందర్య థియేటర్ హాల్లో ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ అరుకు పార్లమెంటు జిల్లా మినీ మహానాడు గురువారంనాడు అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా పార్టీ వ్యవస్థాపకులు, కీర్తిశేషులు ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఎన్టీఆర్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు.అరకు పార్లమెంటు పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి కిలారి శ్రావణ కుమార్ అధ్యక్షతన ఈమహానాడు కార్యక్రమం జరిగింది. గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, పార్టీ పరిశీలకులు హర్షకుమార్, పార్వతీపురం,కురుపాం, రంపచోడవరం ఎమ్మెల్యేలు బోనెల విజయ్ చంద్ర, తోయక జగదీశ్వరి, శిరీషదేవిలతో పాటు అరకు పార్లమెంటు పరిధిలో కీలక నేతలు, నియోజకవర్గ ఇన్చార్జిలు ఆర్ పి భంజదేవ్, వైరిచర్ల వీరేశ్,గిడ్డి ఈశ్వరి, పడాల భూదేవి, ప్రసాద్ తదితరులు పాల్గొని మహానాడు గూర్చి వివరించారు. కార్యకర్తలే పార్టీకి వెన్నుముకని, నాలుగు దశాబ్దాలుగా పార్టీ వెన్నంటే ఉండి విజయాలు అందిస్తున్నారని వారి కృషిని మరువలేమని స్పష్టం చేశారు. ఏవైనా చిన్నపాటి సమస్యలు ఉంటే పరిష్కరించుకొని ఐకమత్యంగా ముందుకు సాగాలని సూచించారు. పార్టీ అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేస్తూ కా ర్య క ర్త ల కు అండదండగా ఉంటామని తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి ఎ ా ం ా చంద్రబాబునాయుడు, పార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్రమంత్రి నారా లోకేష్ లు తెలుగుదేశంపార్టీ అభివృద్ధికి, ఎన్డీఏ ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల అభ్యున్నతికి చేస్తున్న కృషిని వివరించారు. ఈనెల 27 28 29 తేదీల్లో కడపలో జరగనున్న మహానాడు కార్యక్రమానికి అరకు పార్లమెంటు పరిధి నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు.అరకు పార్లమెంట్ మహానాడు కార్యక్రమాన్ని పార్వతీపురం జిల్లా కేంద్రంలో దిగ్విజయంగా ఏర్పాటు చేసి నిర్వహించిన ఎమ్మెల్యే విజయ్ చంద్రను అభినందించారు. ఎమ్మెల్యే విజయ్ చంద్రకు రాజకీయంగా ఉజ్వల భవిష్యత్తు ఉందని స్పష్టంచేశారు. పార్వతీపురం ఎమ్మెల్యే విజయ చంద్ర మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా పార్టీ విజయవంతంగా సాగడానికి క్రమశిక్షణగల కార్యకర్తలే కారణమన్నారు. పార్టీ కోసం కష్టపడిన తనలాంటి ఎంతో మంది కార్యకర్తలకు ఎన్నో ఉన్నత స్థాయి పదవులు వచ్చాయని, ఆవిషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని సూచించారు. పార్వతీపురం నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని,కార్యకర్తల కష్టసుఖాల్లో పాల్గొంటారని తెలిపారు. ఏడాదిలో తాను చేసిన అభివృద్ధి చూసి ఓర్వలేక తనపై లేనిపోని బురద జల్లుతున్నారని, కార్యకర్తలు తిప్పి కొట్టాలన్నారు. తాను జీవించి ఉన్నంతవరకు తెలుగుదేశంపార్టీ కోసం పనిచేస్తానన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ సమయంలో తనలాంటివారు పుట్టనప్పటికీ పార్టీ సిద్ధాంతాలు ఆశయాల కోసం నిరంతరం పనిచేస్తామన్నారు

టిడిపినేతలను ఘనంగా సత్కరించిన ఎమ్మెల్యే విజయ్ చంద్ర

పార్వతీపురంలో నిర్వహించిన అరకు పార్లమెంటు మహానాడుకు హాజరైన టిడిపి సీనియర్ నాయకులును, ఎమ్మెల్యేలును, టిడిపి నియోజకవర్గ ఇంచార్జిలను, అద్యక్షులను ఎమ్మెల్యే విజయచంద్ర ఘనంగా సత్కరించారు. మహానాడు కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో వేదికపైనుండి ముఖ్య నాయకులను సాధరంగా తననివాసానికి ఆహ్వానించిన ఎమ్మెల్యే విజయ్ చంద్ర వారందరినీ శాలువాలతో సత్కరించి, తెలుగు మహిళా నేతలకు చీరలు కానుకగా ఇచ్చి అభినందనలు తెలియజేశారు. అరకు పార్లమెంటు మహానాడును కనీ విని ఎరుగని రీతిలో విజయవంతంగా నిర్వహించిన ఎమ్మెల్యే విజయ్ చంద్రపై టిడిపి నాయకులు, ఎమ్మెల్యేలు ప్రశంసలు కురిపించారు. ఏడు నియోజకవర్గాల పరిధిలో మహానాడులో తీర్మానాలు చేసి వాటిని రాష్ట్ర మహానాడుకు పంపించడం జరుగుతుందని అరకు పార్లమెంట్ అధ్యక్షులు శ్రావణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడు శాసనసభ నియోజకవర్గాల పరిధిలోని క్రియాశీలక నాయకులు ,పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ,అభిమానులు పాల్గొన్నారు. అరకు పార్లమెంట్ మహానాడును దిగ్విజయంగా నిర్వహించడంలో క్రియాశీలకపాత్ర పోషించిన పార్వతీపురం సీతానగరం బలిజిపేట మండల నాయకులను ఎమ్మెల్యే విజయ్ చంద్ర అభినందించారు.

యదేచ్ఛగా మహావృక్షాల నరికివేత...

ఆర్ అండ్ బి రోడ్డు పక్కనే ఈ చిత్రం.

. చోద్యం చూస్తున్న అధికారులు పట్టించుకోని సిబ్బంది.

విశాలాంధ్ర-అడ్డతీగల: ఏజెన్సీ అడ్డతీగల మండలంలోని నాయుడు పాకల గ్రామం వద్ద ఏలేశ్వరం అడ్డతీగల ప్రధాని రహదారికి ఇరువైపులా దశాబ్దాల తరబడి ఎంతోమంది బాటసారులకు వాహనదారులకు చుట్టుపక్కల గ్రామస్తులకు నీడనిచ్చిన మహావృక్షాలను ఎటువంటి అధికార అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా యంత్రాలతో నరికి వేస్తుంటే ప్రశ్నించాల్సిన రహదారుల భవనముల శాఖ అధికారులు మరియు సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఏజెన్సీ వాసులు ఆరోపిస్తున్నారు. సొంత పొలంలో చెట్టు ఉన్న అది సంబంధిత రైతుకు అడ్డుగా ఉంటే ఫారెస్ట్ అధికారుల అనుమతి పొందిన తర్వాతే తొలగించాలని నిబంధన ఉన్నప్పటికీ అట్లాంటిది ప్రధాన రహదారికి ఇరువైపులా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న చెట్లను మాత్రం ఎవరి అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా తొలగించడం చూస్తుంటే కొంతమంది కిందిస్థాయి సిబ్బంది కాసులకు కక్కుర్తి పడి తమ కను సన్నల్లోనే ఈ తతంగం నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మధ్యకాలంలో అడ్డతీగల మీదుగా నేషనల్ హైవే రహదారి నిర్మాణం పూర్తవుతున్న తరుణంలో ఈ ప్రాంతంలో రోడ్డు పక్క భూములను భారీ ధరలు వెచ్చించి కొంతమంది బినామీ గిరిజనుల పేరుతో భూములను కొనడంతో పాటు అమ్మకాలు కూడా సాగిస్తున్నారు. అందులో భాగంగా భూములను కొన్న యజమానులు ఈ మహా వృక్షాలను నరికివేత వంటి అకృత్యాలకు పాల్పడుతూ ప్రభుత్వ స్థలాలను సైతం కలిపేసుకుంటున్నారని అంతేకాకుండా పొలాలకు రక్షణగా ఇనుపకంచెలను సైతం ఏర్పాటు చేస్తున్నట్లు తెలియ వచ్చింది. దశాబ్దాలుగా ఉన్న ఈ మహావృక్షాలు అప్పటి గిరిజన యజమానులకు ఎటువంటి ఆటంకం అనిపించని ఈ తురాయి చెట్లు ఇప్పుడు ఎందుకు హఠాత్తుగా అడ్డం రావడానికి గల కారణం భూమి ధరకు రెక్కలు రావడమే అనేది బహిరంగ రహస్యం. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంతరించిపోతున్న మహా వృక్షాలను కాపాడాలని పలువురు సూచిస్తున్నారు.

విద్యుత్ కోసం మజ్జులపేట వాసుల ధర్నా

విశాలాంధ్ర-సాలూరు: పండుగ పూర్తయిన కూడా పట్టణం లోని ప్రజలను విద్యుత్ కోతలు ఇంకా వీడడం లేదు.గురువారం నాటికి కూడా పట్టణమంతా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేయలేకపోయారు.బుధవారం ఆందోళన కార్యక్రమాలు చేసిన వీధులకు విద్యుత్ సరఫరా కోసం అధికారులు చర్యలు చేపట్టారు.పండుగ వెళ్లి రెండు రోజుల యినా తమకు విద్యుత్ సరఫరా లేదని మజ్జులపేట ప్రజలు గురువారం మోసూరు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.జనసేన కౌన్సిలర్ రాపాక మాధవరావు ఆధ్వర్యాన స్థానికులు రహదారి పై బైఠాయించి వాహనాల రాకపోకలు అడ్డుకున్నారు.అధికారుల వైఫల్యం కారణంగా నే పట్టణప్రజలకు కరెంటు కష్టాలు ఎక్కువయ్యాయని విమర్శించారు.పండుగ ముందు నెలరోజుల పాటు విద్యుత్ స్థంబాలు మార్పు,ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు అంటూ విద్యుత్ అరకొరగా సరఫరా చేశారన్నారు.ఎందుకు ఇలా జరుగుతుందని అడిగితే పండుగ నాలుగురోజులు నిరాటంకంగా సరఫరా చేస్తామని అందులో భాగంగానే మరమ్మత్తులు చేపడు తున్నామని తెలిపారన్నారు. నాలుగురోజుల నుండి విద్యుత్ లేకపోవడం తో స్నానాలు చేయలేక

చిన్నారుల సైతం అల్లాడిపోతున్నారన్నారు.విద్యుత్ ఎప్పుడు పునరుద్ధరణ చేస్తారో చెప్పాలంటూ విద్యుత్ అధికారులను నిలదీశారు.పట్టణ సిఐ అప్పలనాయుడు అక్కడకు చేరుకొని ప్రజలను శాంతింపజేశారు.విద్యుత్ సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నారు..

గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నం

విశాలాంధ్ర-కురుపాం: మండలం లోని గొటివాడ గ్రామానికి చెందిన తిమ్మక శ్రీనివాసరావు(41) గురువారం గడ్డి ముందు త్రాగి ఆత్మహత్య యత్నం చేశాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకుని వచ్చి వైద్యం అందించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేయగా 108 వాహనం లో పార్వతీ పురం తరలించారు. కుటుంబ సభ్యులు అందించిన వివరాలు ప్రకారం కుటుంబ కలహాలు నేపధ్యంలో మనస్థాపానికి గురైన ఆయన ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డారని తెలిపారు.